# ఆగని ఇసుక దోపిడీ

## అప్పుడు వైసీపీ, ఇప్పుడు కూటమి నేతలు..

హమ్మయ్య... ఇక ఇసుక కష్టం తొలగిందనుకున్న ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది. ప్రభుత్వం మారినా నాయకుల తీరు మారలేదు. అధికారంలో ఎవరున్నా ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతూనే ఉందని జిల్లాలోని పరిణామాలు నిరూపిస్తున్నాయి. తిరుపతి జిల్లాలో ఇసుక ఖజానా స్వర్ణముఖి నది. ఈ నదిలో ఎక్కడా అధికారిక రీచ్‌లే లేకపోయినా అనేక ప్రాంతాల్లో జేసీబీలతో తవ్వి, లారీల్లో, ట్రాక్టర్లలో తరలించేస్తున్నారు. చెన్నైలో లారీ ఇసుక రూ.80 వేల నుంచీ లక్ష దాకా పలుకుతుండడంతో ఉత్తరాంధ్ర నుంచి గెలిచిన కూటమి నాయకుడు ఒకరు రంగంలోకి దిగి ఇసుక స్మగ్లింగ్ పగ్గాలు చేతికి తీసుకున్నారు. స్థానిక నేతలను తగినట్లుగా శాంతపరిచి రూ.వందల కోట్ల ఇసుక దోచేసేందుకు తగిన స్కెచ్‌తో ముందుకుపోతున్నారు. మరోవైపు ఉచితం అని చెప్పిన ఇసుకకు ఇన్ని కష్టాలేమిటి బాబూ అని ప్రజలు లబోదిబోమంటున్నారు. రవాణా చార్జీల పేరుతో బాదేస్తున్నారని వాపోతున్నారు. అప్రమత్తమై కఠినంగా వ్యవహరించకపోతే కూటమి ప్రభుత్వం మీద కూడా ఇసుక మచ్చ పడే అవకాశం ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



పెన్నలపాడు వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక కోసం బారులు తీరిన టిప్పర్లు, ట్రాక్టర్లు.



పెన్నలపాడు వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు

### తెర వెనుక ఉత్తరాంధ్ర బడా నేత

తొట్టంబేడు ఇసుక అక్రమ దందా వ్యవహారంలో ఉత్తరాంధ్రకు చెందిన ఓ బడా నేత తెర వెనుక ప్రధాన పాత్ర వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి కడప జిల్లా నుంచీ తండ్రి సారా వ్యాపారం కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అడుగుపెట్టిన ఈయన గతంలో టీడీపీ అధినేతకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. ప్రస్తుతం కూటమిలోని ఓ పార్టీ నుంచి ఇటీవలి ఎన్నికల్లో ఉత్తరాంధ్ర నుంచీ ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారు. ఉత్తరాంధ్ర నుంచే తన మనుషులను శ్రీకాళహస్తికి పంపి ఇసుక దందా నడుపుతున్నారని చెబుతున్నారు. శ్రీకాళహస్తి ప్రాంత నేతలకు ప్రత్యక్షంగా ప్రమేయం లేకపోయినా, ఆయన పంచుతున్న వాటాలకు తలొంచినట్లు ప్రచారం ఉంది. ఇక ఇసుక తమిళనాడుకు తరలే మార్గాల్లోని అధికార పార్టీ నేతలు అభ్యంతరం చెప్పకుండా వారికి కూడా పర్సెంటేజీలు ఖరారు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. అధికార కూటమిలోని బడా నేత వెనుక ఉండడంతో తిరుపతి, చిత్తూరు జిల్లాల యంత్రాంగాలు సైతం గట్టిగా వ్యవహరించడం లేదని అంటున్నారు.

### శ్రీకాళహస్తి ప్రాంతంలో రీచ్‌లే లేవు

శ్రీకాళహస్తిలో అధికారికంగా ఇసుక రీచ్‌లు లేవు. ఇసుక రీచ్‌ల కోసం పరిశీలన కూడా ఇప్పటిదాకా జరగలేదు. మైన్స్ అండ్ జియాలజీ శాఖ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా రీచ్‌లను ఎంపిక చేయాల్సి వుంది. ఆ తర్వాతే అనుమతులు ఇస్తాం.

- రవిశంకర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో

### ఇసుక ట్రాక్టర్... ఎప్పుడెంత?

| ప్రాంతం | 2018లో (టీడీపీ హయాంలో) | 2019-2024 మధ్య (వైసీపీ ప్రభుత్వంలో) | ప్రస్తుత ధరలు |
|---|---|---|---|
| తిరుపతి | రూ. 2000 | 450 | 2200 |
| గూడూరు | 1800 | 7500 | 5000 |
| శ్రీకాళహసి | 1500 | 2500 | 3000 |
| నాయుడుపేట | 1280 | 4500 | 4000 |
| పుత్తూరు | 2800 | 4500 | 3500 |
| వెంకటగిరి | 2200 | 4.500 | 4,000 |

- శ్రీకాళహస్తి, తిరుపతి రూరల్, చంద్రగిరి ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు, తరలింపులు
- అనధికారిక రీచ్‌ల్లో అక్రమ తవ్వకాలపై స్పందించని జిల్లా యంత్రాంగం

### శ్రీకాళహస్తిలో కొల్లగొడుతున్నారు ఇలా..

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలోని విరూపాక్షపురం, పెన్నలపాడు గ్రామాల వద్ద స్వర్ణముఖి నదిలో భారీఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాయి. విరూపాక్షపురం వద్ద 19రోజులుగా తవ్వకాలు జరుగుతుంటే పెన్నలపాడు వద్ద 16 రోజులుగా నడుస్తున్నాయి. నిజానికి ఇక్కడ రీచ్‌లకు ప్రభుత్వం నుంచీ ఎలాంటి అనుమతులూ లేవు. అయినా విరూపాక్షపురం వద్ద నదిలో ఏకంగా ఐదు కిలోమీటర్ల మేర అంతర్గత గ్రావెల్ రోడ్డు నిర్మించుకుని మరీ ఇసుక తరలిస్తున్నారు. మూడు ఇటాచీలు, రెండు జేసీబీలు నిరంతరాయంగా ఇక్కడ పనిచేస్తున్నాయి. టిప్పర్లు, టర్బో లారీలు, ట్రాక్టర్లు బారులు తీరి ఉంటున్నాయి. ఇక్కడ ఇసుక నింపుకుని పది కిలోమీటర్ల దూరంలోని జ్ఞానమ్మ కండ్రిగ వద్ద ప్రైవేటు భూమిలో డంప్ చేస్తున్నారు. ఈ అనధికారిక రీచ్‌లు నిర్వాహకుల కార్లతో సందడిగా ఉంటున్నాయి. ఇక డంప్ వద్ద సోలార్ పవర్‌తో పనిచేసే సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేసుకున్నారు. పెన్నలపాడు వద్ద స్వర్ణముఖి నది మధ్యలోనే రోడ్డు నిర్మించి ఇసుక తవ్వకాలు చేపట్టారు. వారం రోజులుగా ఇక్కడ రెండు ఇటాచీలు, ఒక జేసీబీ ఇసుక తవ్వి లారీలకు, ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్నాయి. ఇక్కడ ట్రాక్టర్ల కంటే టర్బో లారీలే అధికంగా వున్నాయి.



విరూపాక్షపురం వద్ద ఇసుక తరలించేందుకు బారులు తీరిన టిప్పర్లు, ట్రాక్టర్లు

### రూ.60 కోట్లు మింగేశారు

విరూపాక్షపురం, పెన్నలపాడు గ్రామాల నుంచీ 300 లారీలు ఇసుక తరలింపులో బిజీగా ఉన్నాయి. రోజుకు రెండు ట్రిప్పుల చొప్పున మొత్తం 600 లారీల ఇసుక చెన్నైకి తరలుతోంది. చెన్నైలోని రెడ్ హిల్స్ ప్రాంతానికి చేరుతున్న లారీ లోడ్ ధర అక్కడ రూ. 80 వేలదాకా ఉందని అంటున్నారు. నిర్మాణాల్లో పూత పనికి వినియోగించే నున్నటి ఇసుక ధర రూ. లక్ష పలుకుతోందని సమాచారం. ఇలా ఇరవై రోజులుగా దాదాపు రూ. 60 కోట్లు సొమ్ము చేసుకున్నట్టు అంచనా.

### కింద ఇసుక దాచి తరలిస్తున్నారు.

శ్రీకాళహస్తి ప్రాంతం నుంచి ప్రధానంగా చెన్నైకి ఇసుక తరలిపోతోంది. ఇసుక మీద ఒక వరుస ఇటుకలు నింపుకుని కొన్ని లారీలు, తెలుగుగంగ కాలువ రోడ్డు మార్గంలో స్టోన్ క్రషర్స్ వద్ద ఇసుకపైన రాతి పొడి నింపుకుని కొన్ని లారీలు చెన్నైకి చేరుతున్నాయి. మరికొన్ని లారీలపై ధాన్యం పొట్టు, వరి ధాన్యం వంటి బస్తాలు వేసి వాటిపై గ్రీన్ మ్యాట్ వేసుకుని దర్జాగా సరిహద్దులు దాటేస్తున్నాయి. ఎక్కువగా తొట్టంబేడు నుంచీ బీఎన్ కండ్రిగ, తడ మండలాల మీదుగా తమిళనాడుకు ఇసుక తరలి వెళ్లేది. అయితే తిరువళ్ళూరు జిల్లా పోలీసు అధికారి కఠినంగా వ్యవహరిస్తుండడంతో ఎక్కువ లారీలు ఏర్పేడు, రేణిగుంట, తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, పూతలపట్టు, చిత్తూరు, వేలూరుల మీదుగా చెన్నై చేరుతున్నట్టు సమాచారం. అలాగే జీడీనెల్లూరు మీదుగా తమిళనాడు సరిహద్దులు దాటిస్తున్నట్టు చెబుతున్నారు.

### రశీదులు కూడా ఇస్తున్నారు

విరూపాక్షపురం, పెన్నలపాడు నుంచి ట్రాక్టర్లలో స్థానిక అవసరాలకు కూడా ఇసుక తరలుతోంది.అయితే 300 లారీలకు ఇసుక నింపాకే స్థానిక అవసరాలకు కేటాయిస్తున్నట్టు సమాచారం. జేసీబీ ద్వారా ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తే రూ.1100 చొప్పున,కూలీలు లోడ్ చేస్తే రూ.500 చొప్పున అనధికారిక రీచ్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. రోజువారీ 300ట్రాక్టర్ లోడ్ల ఇసుక శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట, తిరుపతి, బీఎన్ కండ్రిగ, వరదయ్యపాలెం మండలాలకు వెళుతోంది.ఎక్కువమంది ట్రాక్టర్ ఆపరేటర్లు జేసీబీ ద్వారానే ఇసుక లోడ్ చేయించుకుంటున్నారు.జేసీబీలతో నింపే ట్రాక్టర్ల నుంచీ వసూలు చేస్తున్న రూ.1100కు అనధికారిక రీచ్ నిర్వాహకులు రశీదు కూడా ఇస్తున్నారు. ఎస్‌కేఈ ట్రేడింగ్ కంపెనీ పేరిట ఇస్తున్న రశీదులపై ప్లాట్ నంబరు 29, కవిత అపార్ట్‌మెంట్స్, బెంజ్ సర్కిల్, విజయవాడ అన్న చిరునామా ముద్రించి వుంది. ఈ కంపెనీ ఎవరిదో, వీరికి రీచ్ అనుమతి ఎవరు ఇచ్చారో ప్రభుత్వం తేల్చాల్సివుంది.

తొట్టంబేడు మండలంలోని అనధికారిక ఇసుక రీచ్‌ల్లో ఇసుక ట్రాక్టర్లకు జారీ చేస్తున్న రశీదు






విరూపాక్షపురం వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు

### ఉచితం... కాస్త ఖరీదే!

వైసీపీ ప్రభుత్వ పాలనలోకన్నా ఇసుక ధరలు తగ్గాయి కానీ ప్రజలు ఆశించినంత మాత్రం కాదు. పైగా ఇసుక దొరకడం కష్టంగా మారింది. జిల్లాలో ఇసుక రీచ్‌లను ఇంకా ప్రారంభించలేదు. ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకనే ఇస్తున్నారు. ఇసుక ఉచితమే అయినా లారీలోకి లోడ్, అన్‌లోడ్ చేయడానికి, ఇంటివరకు తీసుకెళ్లడానికి అయ్యే రవాణా ఖర్చు మాత్రం వినియోగదారు భరించాల్సి వస్తోంది. ఈ భారం రకరకాలుగా ఉంది. అనధికార రీచ్‌ల్లో అయితే ఇష్టానుసారం బాదేస్తున్నారు.

**జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక**

మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. పిచ్చాటూరు మండలం కృష్ణగిరి వద్దగల అడివికొడియంబేడు స్టాక్ పాయింట్‌లో 139017 మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ స్టాక్ పాయింట్ వద్ద 2241 మెట్రిక్ టన్నులు, వెంకటగిరి స్టాక్ పాయింట్‌లో 941, దొరవారిసత్రం- సూళ్లూరుపేటలో 21465 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.నిర్వహణ ఖర్చులు కింద టన్నుకు పిచ్చాటూరు, నాగలాపురంలో మెట్రిక్ టన్నుకు రూ.200, వెంకటగిరిలో రూ.590, సూళ్లూరుపేటలో రూ.465 వసూలు చేస్తున్నారు. దూరాన్ని బట్టి రవాణా ఖర్చులుంటాయి. కాగా చంద్రగిరి మండలంలోని నాగయ్యగారి పల్లె, శానంబట్ల ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటుచేయడానికి అధికారులు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. చంద్రగిరి మండలంలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తే తిరుపతి ప్రజలకు ఇంకా తక్కువ ధరకే ఇసుక లభించే అవకాశం ఉంది.

### వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి... ఇసుక దందా

ఏర్పేడు మండలం కొత్త వీరాపురం - మోదుగులపాలెం గ్రామాల మధ్య స్వర్ణముఖి నదిలో గత నెల 28 నుంచీ ఈనెల 1వ తేదీ వరకూ ఇసుక అక్రమ తవ్వకాలు భారీగా జరిగాయి. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడొకరి కుమారుడి పేరు ఈ దందా వెనుక ప్రధానంగా వినిపించింది. ఆ మాజీ బోర్డు సభ్యుడు గత ఐదేళ్లూ వైసీపీలో వుండి ఎన్నికల ముందు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అతడి కుమారుడు గత వైసీపీ ప్రభుత్వంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగారు. ఆయనే స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు. అయితే ఈ నెల 1వ తేదీన మోదుగులపాలెం సర్పంచ్ జయరామయ్య, గ్రామస్తులు తవ్వకాలను అడ్డుకుని రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తవ్వకాలు జరుపుతున్న యంత్రాలను అధికారులు పంపివేసి, వాహనాలు నదిలోకి రాకుండా ట్రెంచి తవ్వించారు. నదిలో వేసిన రోడ్డును కూడా తవ్వించేశారు. ప్రస్తుతానికి ఇక్కడ ఇసుక దందా ఆగింది.



జ్ఞానమ్మ కండ్రిగ వద్ద అనధికారిక ఇసుక డంప్



మోదుగులపాలెం వద్ద ఇసుక తవ్వకాల కోసం నిర్మించిన రోడ్డును తవ్వించేసిన రెవిన్యూ అధికారులు, గ్రామస్తులు



మోదుగులపాలెం వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు, తరలింపు కోసం నదిలోనే నిర్మించిన రోడ్డు





చంద్రగిరి మండలంలో ఇసుక తరలింపు - తిరుపతి రూరల్ మండలంలో ఇసుక తరలింపు

### చంద్రగిరి నియోజకవర్గంలో ఇసుక దొంగలు

స్వర్ణముఖి నది జన్మస్థలమైన చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లోనూ ఇసుక అక్రమ దందా విచ్చలవిడిగా సాగుతోంది. రోజుకు సుమారు 100కు పైగా ట్రాక్టర్లు అక్రమంగా స్వర్ణముఖి నదిని తోడేస్తున్నాయి. నరసింగాపురం, రెడ్డివారిపల్లె సమీపంలో పెద్దఎత్తున ఇసుక తరలిస్తున్నారు. అదేవిధంగా తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లి సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సమీప గ్రామాలైన పైడిపల్లి, గొల్లపల్లె, దుర్గసముద్రం, చిగురువాడ, పాతకాల్వ, రామానుజపల్లె, అడపారెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు పార్టీలకతీతంగా ఇసుకను తరలిస్తున్నట్టు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలు చెప్పిన ట్రాక్టర్లను మాత్రమే ఎస్‌ఈబీ అధికారులకు అనుమతిస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కో ట్రాక్టరు రూ.10వేలు అడ్వాన్సుగా చెల్లించడంతో పాటు రోజూ వెయ్యి రూపాయలు నేతలకు సమర్పించుకోవాల్సివస్తోందన్న ఆరోపణలున్నాయి.

# నెల్లూరు కల నెరవేరింది

## షార్ సందర్శనపై పవన్ కల్యాణ్



రాకెట్ అనుసంధాన భవనం వద్ద షార్ డైరెక్టర్ రాజరాజన్‌తో పవన్

సూళ్లూరుపేట, ఆగస్టు 13 : నెల్లూరులో చదువుకునే రోజుల్లో శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగాలు చేపడతారని తెలిసి అక్కడికి వెళ్లాలనుకున్నా.అయితే శాస్త్రవేత్తలుంటారు కాబట్టి భారీ భద్రతా ఏర్పాట్లుంటాయి కాబట్టి వెళ్లలేమలే అనుకునే వాడిని.అయితే ఈ రోజు యాధృచ్ఛికంగా అంతరిక్ష దినోత్సవానికి హాజరై షార్ సందర్శించడమనే కల నెరవేరింది...అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు.ఎవరైనా మంచిని బలంగా కోరుకుంటే అది తప్పకుండా నెరవేరుతుందనేది తన విషయంలో నిజమైందన్నారు. షార్‌లో మంగళవారం జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని కురుప్ ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి అంతరిక్ష దినోత్సవాలను ప్రారంభించారు.అనంతరం షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒకప్పుడు 40 వేల ఎకరాల చిట్టడవిలో ఉన్న శ్రీహరికోట నేడు దేశానికే తలమానికంగా మారిందంటే అది శాస్త్రవేత్తల ఘనతేనని తెలిపారు.అంతరిక్షంలోకి మనిషిని పంపడం మన ముందున్న సవాల్ అని అది కూడా శ్రీహరికోట నుంచి పంపించేందుకు సన్నాహాలు చేయడం శుభపరిణామమన్నారు.ఇస్రో పరిశోధనలకు, కార్యక్రమాలకు ఏపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. ఏపీ యువతలో అపరిమితమైన జిజ్ఞాస వుందని, దాన్ని సరైన రీతిలో ముందుకు తీసుకెళ్లే దారి లేక యువత ప్రత్యామ్నాయాల వైపు చూస్తోందన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరముందన్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల ఫలాలు సామాన్యులకు సైతం అందినప్పుడే నిజమైన విజయమన్నారు.అందులో భాగంగానే అంతరిక్ష పరిశోధనల గురించి గ్రామీణ యువతకు సైతం తెలియజేసేందుకు ఇస్రో ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్ల కలను చంద్రయాన్-3 విజయంతో నెరవేర్చుకొన్నామని, ఇది దేశానికి కానుకగా ఇస్రో ఇచ్చిన భారీ విజయమన్నారు. 2023వ సంవత్సరం ఆగస్టు 23న చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ అయిన రోజును భారత ప్రభుత్వం అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.దేశ వ్యాప్తంగా సంబరాలు చేసి మారుమూల గ్రామాలకు సైతం అంతరిక్ష పరిశోధనలు తీసుకెళ్లడం మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల భావి తరాలకు ఎంతో ఉపయోగమన్నారు.అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.పవన్‌కు అధికారులు చంద్రయాన్ 3రాకెట్ నమూనాను బహూకరించారు.అంతకుముందు పవన్ కల్యాణ్‌కు హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్,ఎస్పీ సుబ్బరాయుడు, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ స్వాగతం పలికారు.కురుప్ ఆడిటోరియంలో ఆయనకు షార్ డైరెక్టర్ చంద్రయాన్-3 రాకెట్ నమూనాను, ఉపగ్రహాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసుల రెడ్డి,అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్, డిప్యూటీ డైరెక్టర్ టీఎస్ రఘురామ్, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




శాస్త్రవేత్తలు ఇచ్చిన చంద్రయాన్-3 శాటిలైట్ నమూనాను అబ్బురంగా చూస్తున్న పవన్‌కల్యాణ్

### షార్ రోడ్డును ఐదు రోజుల్లో బాగు చేయిస్తాం!

తిరుపతి నుంచీ షార్ వెళ్ళే మార్గంలో బుచ్చినాయుడు కండ్రిగ నుంచీ షార్ వరకూ 17 కిలోమీటర్ల మేరకు రోడ్డును ఐదు రోజుల్లో బాగు చేయిస్తామని పవన్ కల్యాణ్ హామీఇచ్చారు. ఈ రోడ్డు బాగాలేదని షార్ అధికారులు తన దృష్టికి తెచ్చారని, వెంటనే తాను కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు మొదలు పెట్టించానన్నారు.మరో ఐదు రోజుల్లో పనులు పూర్తవుతాయన్నారు. ఇలాంటి పనులు చేపట్టే బాధ్యత తామే తీసుకుంటామన్నారు.

### షార్‌లో వివిధ విభాగాల సందర్శన

షార్‌లో వివిధ విభాగాలను పవన్ కల్యాణ్ సందర్శించారు. లాంచ్‌ప్యాడ్, రాకెట్ అనుసంధానం చేసే పిఫ్ భవనంతో పాటు ఎంసీసీ భవనాన్ని ఆయన సందర్శించారు.అంతరిక్ష కేంద్రంలో ఉన్న విభాగాల గురించి పవన్‌కు శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా వివరించారు. షార్‌లోని విభాగాల సందర్శనానంతరం మధ్యాహ్నం 4.30 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని తిరుగుపయనమయ్యారు.

## వరలక్ష్మి వ్రతానికి ఏర్పాట్లు పూర్తి

తిరుచానూరు, ఆగస్టు 13: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించనున్న వరలక్ష్మి వ్రతానికి ఏర్పాట్లు పూర్తయినట్లు జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. మంగళవారం తిరుచానూరులోని ఆస్థాన మండపంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ దీపాలు, పుష్పాలతో ఆస్థాన మండపాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలన్నారు.ఆస్థాన మండపంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 12గంటల వరకు వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నట్లు వివరించారు. సాయంత్రం 6గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

### రేపు తిరుచానూరులో వ్రత టిక్కెట్ల విడుదల

శుక్రవారం జరిగే వరలక్ష్మి వ్రతంలో పాల్గొనే భక్తులకు అమ్మవారి ఆలయం వద్ద గల కుంకుమార్చన కౌంటర్‌లో గురువారం ఉదయం 9గంటలకు టిక్కెట్లు అందజేయనున్నట్లు డిప్యూటీ ఈవో గోవిందరాజన్ తెలిపారు. కరెంటు బుకింగ్ ద్వారా 150 టిక్కెట్లు మాత్రమే అందజేయబడతాయని, వ్రతంలో పాల్గొనే భక్తులు ఆధార్‌కార్డు తీసుకువచ్చి టిక్కెటు పొందాలని తెలిపారు.

## తిరుమలలో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి



తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సినీహీరో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని భాస్కర్‌భవన్‌కు చేరుకున్న వీరికి స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. వీరు బుధవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

## 'గల్లా' ఇంట్లో గ్రంథాలయం



తవణంపల్లె, ఆగస్టు 13: మాజీ మంత్రి గల్లా అరుణకుమారి సొంతూరు తవణంపల్లె మండలం దిగువమాఘంలోని తమ ఇంట్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజ, డాక్టర్ గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారితో కలిసి దీనిని ప్రారంభించారు. పుస్తకం ఇచ్చే స్ఫూర్తిని టీచర్ కూడా ఇవ్వలేదని, పుస్తకం గురువును మించిందని ఈ సందర్భంగా గల్లా అరుణ అన్నారు. పుస్తకాలు మన ఐశ్వర్యమని, ఇంటింటా పుస్తకాల ర్యాక్ ఉండాలని సాకం నాగరాజ అన్నారు. కార్యక్రమంలో రచయితలు నామిని సుబ్రమణ్యం నాయుడు, అరుణకుమారి, మౌని, పేరూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. రాజాచంద్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్, చిత్తూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సహదేవ నాయుడు, అరసం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గంటా మోహన్, పత్తిపాటి రమేష్ నాయుడు, ధర్మయ్య, బాలకృష్ణారెడ్డి, ముని హాజరయ్యారు.

## వెంగమాంబకు పుష్పాంజలి

తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 207వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో టీటీడీ అధికారులు పుష్పాంజలి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగమాంబ వంశీయులు విశ్వమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంగమాంబ ప్రాజెక్ట్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు



తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో మంగళవారం ఓ కారు అదుపుతప్పింది. అదృష్టవశాత్తు కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం శ్రీవారిని దర్శించుకుని మంగళవారం సాయంత్రం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైంది. మార్గంలోని 5వ మలుపు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపునున్న చిన్నపాటి గుంతలోకి దూసుకుపోయింది. ముందున్న చెట్టును ఢీకొని ఆగిపోయింది. అయితే కారులోని ఐదుగురు భక్తులు స్వల్పగాయాలతో సురక్షితంగానే బయటపడ్డారు. సమాచారం అందుకున్న టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది ఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును తొలగించారు.

## కేవైసీకి రైతులు సహకరించాలి

రామచంద్రాపురం, ఆగస్టు 13 : రామచంద్రాపురం మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు సహకార సంఘాల ఎన్నికల్లో తమ ఓటు హక్కును కొనసాగించుకునేందుకు కేవైసీని తప్పనిసరిగా చేసుకోవాలని సహకార సంఘం ఇన్‌చార్జి సునీల్‌దత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సహకార సంఘంలో సభ్యత్వం, ఓటు హక్కు కలిగిన రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం నకలును ఈ నెల 30వ తేదీ లోపు అందించి కేవైసీ చేసుకోవాలని సీఈవో కన్నయ్య తెలిపారన్నారు. వారికి మాత్రమే రానున్న సహకార సంఘం ఎన్నికల్లో ఓటు హక్కుంటుందన్నారు.

## టీడీపీలో కష్టపడిన వారికే పదవులివ్వండి



లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుబ్బుయాదవ్

మంగళం, ఆగస్టు 13: టీడీపీలో కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలని చంద్రగిరి నియోజకవర్గ బీసీసెల్ ఉపాధ్యక్షుడు పాలముంతల సుబ్బుయాదవ్, సప్తగిరి పంచాయతీ టీడీపీ నాయకుడు గోపాల్‌యాదవ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మంగళవారం విజయవాడలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నామినేటెడ్ పదవుల్లో తమకు చోటు కల్పించాలని కోరారు.

## నాయీ బ్రాహ్మణులకు దేవాలయాల బోర్డుల్లో చోటు కల్పించాలి

మంగళం, ఆగస్టు 13: రాష్ట్రవ్యాప్తంగా నాయీబ్రాహ్మణులకు దేవాలయాల్లో ఏర్పాటు చేసే పాలకమండలిలో సభ్యులుగా స్థానం కల్పించాలని ఆ సంఘం నాయకులు ఆవులపాటి బుజ్జిబాబు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహిళా క్షురకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధాదేవికి టీటీడీ బోర్డులో స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సుధాకర్, వెంకీ, కమల్, రంగయ్య, బాలాజీ, హరిబాబు, మారుతీరావు, శివప్రసాద్, గణేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరి

### శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

చంద్రగిరి, ఆగస్టు 13: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆహ్వానం పలుకుతూ.. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడి ఆధ్వర్యంలో అరిగివారిపల్లె గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆహ్వాన పత్రికను అందజేశారు.

### మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన డీఈవో

చంద్రగిరి, ఆగస్టు 13: చంద్రగిరి మండలంలోని నారావారిపల్లి ప్రాథమిక పాఠశాలను డీఈవో శేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

# పట్టాభూమిలో ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోండి

● మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి




మాట్లాడుతున్న ఎంపీపీ యశోద

తిరుపతి రూరల్, ఆగస్టు 13: తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీలో పట్టా భూమిలో ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలని, పలు పంచాయతీల్లో నెలకొన్న తాగునీరు, పైప్‌లైన్లు, విద్యుత్, ఇంటి పట్టాల సమస్యలను పరిష్కరించాలని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులను కోరారు. తిరుపతి రూరల్‌మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వేముల యశోద అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాడిపేట సర్పంచ్ ధనమునిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో సర్వేనెంబరు 464లోని పట్టాభూమిలో పగలు ట్రాక్టర్లు, రాత్రుల్లో టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని రెవెన్యూ, ఇరిగేషన్, సెబ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని ఆరోపించారు. అక్రమ రవాణాను అడ్డుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ రేఖ తెలిపారు. పేరూరు ఎంపీటీసీ మూలం చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... పేరూరు చెరువుకు తెలుగుగంగ నీటిని తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. పేరూరులో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని అన్నారు. తుమ్మలగుంట నుంచి వచ్చే డ్రైనేజీ నీరు గాంధీపురం పంచాయతీలోని తాగునీటి బోర్లలో కలుస్తోందని, దీని నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ కోరారు. పద్మావతిపురం, వీవీనగర్ పంచాయతీలకు వరద ముప్పు ఉందని ఎంపీటీసీ చెప్పగా,దీని నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఆదేశించారు. ఎంపీడీవో రమేష్‌బాబు, వైస్ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ,అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి,వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్‌కు ఆత్మీయ వీడ్కోలు



పవన్ కల్యాణ్‌కు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 13: ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు మంగళవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తిరుపతి విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. షార్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి అమరావతికి పయనమై విమానాశ్రయానికి చేరుకున్న పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యే నాని కలసి పలు విషయాలపై చర్చించారు. చంద్రగిరి నియోజక అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేయగా, పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు.

## స్వాతంత్ర్య దిన వేడుకలకు తిరుమలలో ఏర్పాట్లు

తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం స్వాతంత్ర్య దిన వేడుకలు జరుగనున్నాయి. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. వివిధ విభాగాల అధికారుల ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం భక్తులు, ఉద్యోగులనుద్దేశించి అదనపు ఈవో ప్రసంగించనున్నారు. ఈమేరకు టీటీడీ ఏర్పాట్లను మొదలుపెట్టింది.

## తహసీల్దారుకు టీడీపీ సన్మానం

బాకరాపేట, ఆగస్టు 13: చిన్నగొట్టిగల్లు తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన జనార్దన్‌రాజును మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి సత్కరించారు. ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, ఎంపీటీసీ విజయకుమారి, మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సహదేవరెడ్డి, చంద్రశేఖర్, హైదర్‌వలీ, శేఖర్‌గౌడ్, యశ్వంత్ రాయల్, రమేశ్, గురుమూర్తి, రాజగోపాల్ నాయుడు, మల్లికార్జునరెడ్డి, మోహన్‌రావు, ప్రతాపరెడ్డి, రెడ్డప్పరెడ్డి, మురళీ, రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెత్తనుంచి సంపద తయారీపై సర్పంచ్‌లకు అవగాహన

పాకాల, ఆగస్టు 13: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో భాగంగా రెండవరోజు మంగళవారం చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పించారు. పాకాల పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచ్‌లు,కార్యదర్శులు సందర్శించారు. తడి, పొడి చెత్త సేకరణ,సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, వర్మీకంపోస్టు తయారీ, మెరుగైన పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు.ఎంపీడీవో ప్రభాకర్, ఈవోపీఆర్డీ మాలతి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో గంగజాతర ప్రారంభం



గంగమ్మ ఆలయం వద్ద భక్తులు

రేణిగుంట, ఆగస్టు 13: రేణిగుంట పట్టణంలో గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. మంగళవారం ఆలయంలో అమ్మవారికి సంప్రదాయబద్ధంగా తొలి హారతి ఇచ్చి జాతరను ప్రారంభించారు. ఉదయం నడివీధి గంగమ్మ త్రిశూలం వద్ద అమ్మవారికి ఇంటి నుంచి భక్తులు వేప తోరణాలు కట్టిన బిందెలు తీసుకొచ్చి అంబళ్లు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. టీడీపీ నాయకుడు మబ్బు దేవనారాయణరెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్‌రెడ్డి, మాజీ సర్పంచు జ్యోతినారాయణ, సభ్యులు సుధ, శివారెడ్డి, రావణ సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. జాతర సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతరకు భక్తులు పోటెత్తడంతో నడివీధి గంగమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. డీఎస్పీ వెంకటాద్రి నేతృత్వంలో సీఐ శరత్‌చంద్ర ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.




## పారా మెడికల్ విద్యార్థుల ర్యాలీ

చంద్రగిరి, ఆగస్టు 13: మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మంగళవారం పారా మెడికల్ విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామారావు మాట్లాడుతూ.. మానవుడి అవయవాలు మరణించిన తర్వాత కూడా కొన్ని గంటల పాటు సజీవంగా ఉంటాయని, వాటిని ఇతరులకు ఉపయోగిస్తే బావుంటుందన్నారు. ప్రజలకు అవయవాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, డీన్ డాక్టర్ జగదీశన్, పారామెడికల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'ఆ కథనంతో చెవిరెడ్డికి సంబంధం లేదు'

చంద్రగిరి, ఆగస్టు 13: టీడీపీ మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడికి వ్యతిరేకంగా ఓ పత్రికలో వచ్చిన కథనంతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఎటువంటి సంబంధం లేదని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.

## నేటితరానికి అల్లూరి ఆదర్శనీయం




ర్యాలీగా వస్తున్న విద్యార్థులు, పక్కనే ఏఐడీఎస్‌వో నాయకులు

తిరుపతి(విద్య), ఆగస్టు 13: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజును నేటియువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ భవన్‌లో ఆలిండియా డెమొక్రటిక్ విద్యార్థి సంఘం (ఏఐడీఎస్‌వో) ఆధ్వర్యంలో మంగళవారం నగర 4వ మహాసభ నిర్వహించారు. ఇందులో భాగంగా బాలాజికాలనీ నుంచి ఎన్టీఆర్ సర్కిల్‌వరకు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. వక్తలుగా హాజరైన సీనియర్ జర్నలిస్ట్ రాఘవశర్మ, ఎస్వీయూ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, సంఘ రాష్ట్ర కార్యదర్శి మహేష్ ప్రసంగించారు. అనంతరం నగర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, కార్యదర్శిగా ఉన్నతి, కోశాధికారిగా తేజశ్రీ, సంయుక్త కార్యదర్శులుగా మధు, ధీరజ్‌లతోపాటు 15మంది సభ్యులను ఎన్నుకున్నారు. అంతకుముందు అల్లూరి చిత్రపటానికి పలువురు పుష్పాలతో నివాళి అర్పించారు. వెంకటసుబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని తాపీ మేస్త్రీకి తీవ్రగాయాలు

పాకాల, ఆగస్టు 13: పాకాల - దామలచెరువు రోడ్డు గుమ్మడివారి ఇండ్లు రైల్వే గేటు సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీకి తీవ్ర గాయాలయ్యాయి. కలకడ మండలం చెరువుముందరపల్లె పంచాయతీ, కదిరిచెరువుపల్లె గ్రామానికి చెందిన కె.నాగరాజు (నాగయ్య - 65) పాకాల పరిసర ప్రాంతాలలో తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. స్వగ్రామానికి వెళ్లి తిరిగి టీవీఎస్‌పై పాకాలకు వస్తుండగా రైల్వే గేటు సమీపంలో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగయ్య కుడి పాదం ఛిద్రమైపోయింది. తల, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం తిరుపతి రుయాసుపత్రికి తరలించి, పాకాల ఎస్సై మహేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలి

రామచంద్రాపురం, ఆగస్టు 13: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా విధానంలో అందిస్తున్న టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మార్కొండయ్య నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. 14 సంవత్సరాలు నిండిన వారు పదవ తరగతికి, పదవ తరగతి పాసైన వారు ఇంటర్మీడియట్‌కు అర్హులన్నారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 13: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని, బాలికలు చదువులో రాణించడం అవసరమని డబ్ల్యూసీడీఏ అండ్ ఎస్సీ ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి అన్నారు. స్థానిక సరోజనిదేవి రోడ్డులోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో విద్యార్థినులకు ఏర్పాటు చేసిన వసతులను, వారికి పెట్టే ఆహారాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ.. బాలికలు చదువుతోపాటు వృత్తి విద్యలు కూడా నేర్చుకోవాలన్నారు. నిరంతరం మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండి ప్రతీ విషయాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ అధికారులు వసంత, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమ నాయుడు, జయలక్ష్మి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## 'అమూల్' పాలసేకరణను రద్దు చేయొద్దు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 13: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పాడిరైతుల నుంచి సేకరిస్తున్న అమూల్ డెయిరీ పాలసేకరణను ప్రభుత్వం రద్దు చేయవద్దని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. గత ప్రభుత్వం విజయ డెయిరీ ఆస్తులను, సంబంధిత పాల కేంద్రాలను అమూల్ సహకార సంఘానికి అప్పగించిందని, అప్పటి నుంచి ఆ డెయిరీ యాజమాన్యం జిల్లాలో గ్రామ, మండల స్థాయిలో వున్న పాత విజయా పాల ఉత్పత్తిదారుల కేంద్రాల పరిధిలో వున్న పాడి రైతుల నుంచి లీటరు పాలకు రూ.37 నుంచి రూ.43 వరకు చెల్లిస్తోందని చెప్పారు. ప్రైవేటు డెయిరీ యజమానులు లీటరు పాలకు రూ.27 నుంచి రూ.33 మాత్రమే చెల్లిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం అమూల్ డెయిరీ పాలసేకరణను రద్దు చేయడానికి ప్రయత్నిస్తే జిల్లాలో మరో రైతు ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ఎంసీఏ ఫలితాల్లో రిమ్స్ విజయకేతనం



అభినందిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఆగస్టు 13: ఎస్వీయూ విడుదల చేసిన ఎంసీఏ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (రిమ్స్) కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు వి.వంశీ 8.50 జీపీఏ, ఎం.గోపిక 8.37, డి.హేమలత 8.34, డి.మణికంఠ 8.33 జీపీఏతో టాపర్లుగా నిలవగా, పరీక్షకు హాజరైన 61మందిలో 56మంది విద్యార్థులు డిస్టింక్షన్లు, ముగ్గురు ప్రథమశ్రేణిలో పాసయ్యారని వివరించారు. కాగా తనతల్లిదండ్రుల జ్ఞాపకార్థం టాపర్లకి ప్రిన్సిపాల్ నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థులను చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, ఎంసీఏ హెడ్ పి.మధుర, ఎంబీఏ హెడ్ డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

## ఏపీ భవిష్యత్తు యువత చేతుల్లోనే

● డీఎస్పీ నరసింగప్ప



యువతకు పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13: రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని చంద్రగిరి డీఎస్పీ నరసింగప్ప పేర్కొన్నారు. తిరుపతి రూరల్ పరిధిలోని ఎంఆర్‌పల్లి స్టేషన్ సీఐ అహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య శాఖ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతకు పొగాకు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే గంజాయి, పొగాకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని పిలుపు నిచ్చారు. సీఐ అహ్మద్ మాట్లాడుతూ.. ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు ప్రతి రోజూ యువత, విద్యార్థులు, మహిళలకు గంజాయి వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం తీసుకురావడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీచర్ల సర్దుబాట్లను ఉపసంహరించుకోవాలి

తిరుపతి(విద్య), ఆగస్టు 13: రాష్ట్రంలో టీచర్ల అసంబద్ధ సర్దుబాట్ల నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫోర్టో) జిల్లా చైర్మన్ దొడ్డ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. జీవో 117ని రద్దుచేసిన తర్వాతే సర్దుబాటు చేపట్టాలని, 15వేలమందికిపైగా ఉన్న టీచర్లని సర్‌ప్లస్‌గా చూపించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం చేస్తున్న టీచర్ల సర్దుబాటుకు శాస్త్రీయతలేదని ఒకప్రకటనలో విమర్శించారు.



షార్‌లోని కురుఫ్ భవనంలో నిర్వహించిన అంతరిక్ష దినోత్సవ సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ - పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్ , ఎస్పీ సుబ్బరాయుడు, షార్ శాస్త్రవేత్తలు, పవన్ కుమార్తె ఆద్య, ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

# వెయ్యి అడుగుల జెండా



వెయ్యి అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

జాతీయ జెండాతో స్కేటింగ్ చేస్తూ..

చిత్తూరులో మంగళవారం వెయ్యి అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు జాతీయత ర్యాలీ నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు కొంగారెడ్డిపల్లి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చారు. విగ్రహం చుట్టూ మానవహారంగా జెండాతో విద్యార్థులు నిలబడ్డారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో పలువురు ఆకట్టుకున్నారు.

● ఇక, విద్యార్థులు, క్రీడాకారులతో గాంధీ విగ్రహం నుంచి పీసీఆర్ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ కొనసాగింది. చిన్నారులు జాతీయ జెండాను చేతపట్టి స్కేటింగ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ వెంట వెళ్లడం ఆకట్టు కుంది.

\- చిత్తూరు (సెంట్రల్)



గాంధీ విగ్రహం చుట్టూ జాతీయ జెండాతో విద్యార్థుల మానవహారం

● 'టీడీఆర్' ఎఫెక్ట్

# కార్పొరేషన్లో ప్రక్షాళన మొదలు

### టౌన్‌ప్లానింగ్ అధికారి బాలసుబ్రహ్మణ్యంపై బదిలీ వేటు

తిరుపతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రక్షాళన మొదలైంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై బదిలీ వేటుకు రంగం సిద్ధమైంది. ఇందులోభాగంగా ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణం నేపథ్యంలో పట్టణ ప్రణాళికా విభాగంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రహ్మణ్యంపై బదిలీ వేటు వేసింది. తిరుపతి ఏసీపీగా డిప్యుటేషన్ రద్దు చేస్తూ రాజంపేట మున్సిపాల్టీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో)గా బదిలీ చేస్తూ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పైగా ఉత్తర్వులు అందిన వెంటనే ఎటువంటి ఆలస్యం చేయకుండా తక్షణమే రిలీవ్ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. దీర్ఘకాలిక సెలవులో ఉన్న బాలసుబ్రహ్మణ్యం గత వైసీపీ ప్రభుత్వంలో (2022 జూన్ 23) తిరుపతి కార్పొరేషన్‌కు ఏసీపీగా డిప్యుటేషన్‌పై చేరారు. అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్ పట్టుబట్టి మరీ ఈయన్ను తెప్పించుకున్నారు. అప్పుడే మాస్టర్‌ప్లాన్ రోడ్ల వ్యవహారం తెరపైకి వచ్చింది. స్థల యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రోడ్ల విస్తరణ చేయడం, కోర్టు ఆదేశాలను కూడా లెక్క చేయకుండా దూకుడుగా వ్యవహరించారన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జరిగిన ఓ కౌన్సిల్ సమావేశంలో బాలసుబ్రహ్మణ్యం చొరవతోనే కొన్ని మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేయగలిగామని డిప్యూటీ మేయర్ అభినయ్ ప్రశంసించారు కూడా. దీంతో మరింత వేగంతో బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించారని, టీడీఆర్ బాండ్ల జారీలోనూ అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిడితో పనిచేసినట్టు ఆరోపణలు వచ్చాయి.

### కార్పొరేటర్ల పాత్రపైనా విచారణ జరిపించండి: టీడీపీ


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు మహేష్ యాదవ్ తదితరులు

తిరుపతిలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై కొందరు కార్పొరేటర్లను కూడా విచారణ చేపట్టాలని టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ కోరారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ మౌర్యకు టీడీపీ నేతలు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ.. వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌లు మాస్టర్‌ప్లాన్ డెవలప్మెంట్ కమిటీని ఏర్పాటు చేసి.. రోడ్లు వేయడంలోనూ, భూసేకరణలోనూ పెద్దఎత్తున కుంభకోణం జరిగిందని ఆరోపించారు. వందల కోట్ల రూపాయల ప్రజాధనం టీడీఆర్ బాండ్ల రూపంలో దుర్వినియోగం జరిగిందన్నారు. తుడా ప్రతిపాదిత రోడ్లు కాకుండా వైసీపీ నేతల స్వార్థ ప్రయోజనాలకోసం నిబంధనల మేరకు ఎలాపడితే అలా నాసిరకం రోడ్లు వేశారని విమర్శించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసమని స్థలాలిచ్చిన నిజమైన లబ్ధిదారులకు ఇప్పటివరకు టీడీఆర్ బాండ్లు చేరలేదని చెప్పారు. ఈ క్రమంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయన్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సీఐడీ విచారణకు, కార్పొరేషన్ అధికారుల అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశించడం హర్షణీయమన్నారు. కమిషనర్‌ను కలిసినవారిలో రవిశంకర్ యాదవ్, రూపేష్, మునికృష్ణ, జయప్రకాశ్ ఉన్నారు.

# వెయ్యి మీటర్ల జాతీయ పతాకం




తిరుపతి అర్బన్, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఏపీ టూరిజం, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో వెయ్యి మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. మహతి కళాక్షేత్రం వద్ద నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి నగర పాలక కమిషనర్ మౌర్య, ఎస్పీ సుబ్బరాయుడు, టూరిజం విభాగం అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తొలుతగా జాతీయగీతాన్ని ఆలపించి.. దేశభక్తిని చాటారు. అనంతరం మహతి నుంచి ఎస్వీయూ మైదానం వరకు భారీ జాతీయ పతాకంతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ ప్రాంతీయ సంచాలకుడు రమణప్రసాద్, జిల్లా పర్యాటక శాఖాధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, ప్రొఫెసర్ రజని, తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ ఓపీ, ఓటీలకు రేపు సెలవు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయన్నారు. రోగులు సహకరించాలని కోరారు.

## అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

### ఆన్‌లైన్ ఫీజు కడితే సరిపోతుంది - డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మెడికల్ ల్యాబ్‌ల లైసెన్సు కోసం తమ కార్యాలయ సిబ్బంది ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ లైసెన్సుల కోసం డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది వసూళ్ల పర్వానికి తెరలేపారని 'ఒక్కడిగా వస్తే రూ.40వేలు.. అసోసియేషన్ ద్వారా వస్తే రూ.23వేలే' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆన్‌లైన్ ఫీజు మాత్రం కడితే సరిపోతుందని, ల్యాబ్ యాజమాన్యం ఎవరికీ ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని 87 ల్యాబ్‌లకు నోటీసులు ఇచ్చామని, ఎలాంటి అర్హతలేకుండా నిర్వహిస్తున్న 27 ల్యాబ్‌లను మూసివేశామన్నారు. నోటీసులు అందుకున్న ల్యాబ్ యాజమానులు ఇంకా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఇదిలావుంటే తమ అసోసియేషన్ తరఫున ఎలాంటి నగదు వసూళ్లు చేయడంలేదని మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వేరొక ప్రకటనలో పేర్కొంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## జీవ వైవిధ్య సంరక్షణ పోటీల విజేతల ఎంపిక

తిరుపతి(విద్య), ఆగస్టు 13: ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలని ఎంపిక చేసినట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు జీవ వైవిధ్య సంరక్షణలో యువతపాత్ర అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారిని విజేతలుగా ఎంపిక చేశామని చెప్పారు. వక్తృత్వంలో.. బి.సంజన(జీహెచ్‌ఎస్, నాగలాపురం), సి.మాధురి (గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, తిరుపతి) కె.నవ్య (అంబేడ్కర్ గురుకులం, సూళ్లూరుపేట), డిబేట్‌లో.. వి.గుణవర్షిణి (ఎస్వీయూ క్యాంపస్, తిరుపతి), వీసీ జ్యోతిష్ (జడ్పీహెచ్‌ఎస్ ప్లస్, మంగళం ట్రెండ్స్), షార్ట్‌ఫిల్మ్ మేకింగ్‌లో.. జడ్పీహెచ్‌ఎస్ (ఊరందూరు), కేజీబీవీ (ఎర్రావారిపాలెం), అంబేడ్కర్ గురుకులం (సూళ్లూరుపేట) ఉన్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన డీవైఈవో బాలాజి మాట్లాడుతూ.. జీవ వైవిధ్యంపై అవగాహన పెంచేందుకు ఈపోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ నెమిలేటి కిట్టన్న, డాక్టర్ రాధాకృష్ణ, చిన్నమ్మ వ్యవహరించారు. జిల్లా కోఆర్డినేటర్ హరిశంకర్, క్యాంపస్ స్కూల్ హెచ్‌ఎం సకీనమ్మ, రిసోర్స్ పర్సన్లు కల్పన, జయకర్, కృష్ణవేణి పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

### మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు


మీడియాతో మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

మంగళం, ఆగస్టు 13: 'ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. ఎస్సీ వర్గీకరణ పూర్తిగా రాజ్యాంగానికి విరుద్ధంగా జరిగింది' అని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఎస్సీ కులాల మధ్య చిచ్చు పెట్టడానికే వర్గీకరణ అంశాన్ని తీసుకొచ్చి, రాజకీయ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేశామన్నారు. రాజ్యాంగం ఎస్సీలకు కల్పించిన రిజర్వేషన్‌ను మరింత లాగేసుకునేందుకు అగ్రవర్ణాలవారు ఈ కుట్ర పన్నుతున్నారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు రద్దు చేసుకోవాలని.. లేకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ప్రభాకర్, రమేష్, గిరి, ధనశేఖర్, సురేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో తిరుపతి క్రీడాకారుల ప్రతిభ



తిరుపతి (క్రీడలు), ఆగస్టు 13: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తిరుపతికి చెందిన శివ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఆదివారం చెన్నైలో జరిగిన కరాటే పోటీలకు వివిధ విభాగాల్లో 55మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఐదుగురు చొప్పున ప్రథమ, ద్వితీయ, 8మంది తృతీయ స్థానంలో రాణించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్ శివకృష్ణను మంగళవారం పలువురు అభినందించారు.


## విద్యుత్ బస్సు డ్రైవర్ల మెరుపు ధర్నా

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 13: విద్యుత్ బస్సు డ్రైవర్లు మంగళవారం ఉదయం మెరుపు ధర్నాకు దిగారు. జూలై నెల వేతనం ఈనెల 5న ఇవ్వాల్సి ఉండగా.. 13వ తేదీ కావస్తున్నా చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ భారమవుతోందని పర్యవేక్షకులను సంప్రదించారు. వారినుంచి నిర్లక్ష్యంగా సమాధానం రావడంతో ఉదయం 4నుంచి 6గంటల వరకు అలిపిరి డిపో నుంచి బస్సులను బయటకు తీయలేదు. డ్రైవర్లంతా బస్సుల ముందు బైఠాయించారు. జీతాలు చెల్లిస్తేనే బస్సులను రోడ్డెక్కిస్తామని భీష్మించుకున్నారు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ హరిబాబు దృష్టికి పర్యవేక్షకులు తీసుకెళ్లారు. ఆయనొచ్చి డ్రైవర్ల సమస్యను బస్సుల యాజమాన్యంకు తెలియజేశారు. రెండ్రోజుల్లో జీతమిస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆయన డ్రైవర్లకు నచ్చజెప్పడంతో శాంతించారు. దీనివల్ల దాదాపు ఉదయం రెండు గంటల పాటు రైల్వేస్టేషన్, బస్టాండులో విద్యుత్ బస్సుల రాకపోకలు స్తంభించాయి.

## వచ్చేనెల 14న జాతీయ లోక్ అదాలత్

తిరుపతి(లీగల్), ఆగస్టు 13: జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబరు 14వ తేదీన తిరుపతి కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజీకి పోదగ్గ క్రిమినల్, సివిల్ కేసులను గుర్తించాలని న్యాయమూర్తులు, న్యాయవాదులకు సూచించారు. నెల రోజుల వ్యవధి ఉండడంతో రోజూ ప్రీ లోక్‌అదాలత్, ప్రీ కౌన్సెలింగ్ ఇరు పార్టీలకు ఇవ్వనున్నామని తెలిపారు. పోలీసులు, న్యాయవాదులు.. న్యాయమూర్తులకు సహకరించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు.

## 108లో ప్రసవం : తల్లీబిడ్డ సురక్షితం


వాహనంలో ప్రసవం తర్వాత తల్లీబిడ్డ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13: గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే ప్రసవం జరిగింది. రేణిగుంటకు చెందిన కాజల్ అనే గర్భిణికి మంగళవారం రాత్రి 11 గంటలకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వాహనం వచ్చాక ఆమెను కాన్పు నిమిత్తం తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకెళుతుండగా, మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ ఊహ.. పైలట్ కేశవుల సాయంతో 108 వాహనంలోనే కాన్పు చేయగా ఆడబిడ్డ పుట్టింది. కాన్పు తర్వాత తల్లీబిడ్డలను మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు అక్కడి వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా 108 సిబ్బందిని వైద్యులు, కాజల్ కుటుంబీకులు అభినందించారు.

# సంస్కృత భాషా క్షేత్రంగా తిరుపతిని తీర్చిదిద్దడమే లక్ష్యం

### ఎన్‌ఎస్‌యూ వీసీ వెల్లడి


మీడియాతో మాట్లాడుతున్న జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి రూరల్, ఆగస్టు 13: నగరంలో వంద సంస్కృత బాల కేంద్రాలను ఏర్పాటు చేసి.. తిరుపతిని సంస్కృత భాషా క్షేత్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్‌ఎస్‌యూ) వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వెల్లడించారు. వర్సిటీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చిన్నారులకు బాల్యం నుంచే సంస్కృతాన్ని బోధించేందుకు నగరంలోని పలు విద్యాసంస్థల్లో బాలకేంద్రాలు, సంస్కృత శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు వర్సిటీ ఆధ్వర్యంలో 70 బాలకేంద్రాలు నడుస్తున్నాయి. వీటి సంఖ్యను వందకు పెంచేందుకు కార్యాచరణ రూపొందించాం. అలాగే ఆగమ, జ్యోతిష, వాస్తు, యోగా, కర్మకాండ శాస్త్రాల్లో ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ఐదు కన్సల్టెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. రోజూ సాయంత్రం 5-6.30గంటలవరకు ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. వర్సిటీలో పలు పురోభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. దీనిలో భాగంగా ఎస్‌సీఎస్ ట్రస్ట్ ద్వారా రామాయణ గ్రంథాలపై పరిశోధనకు వాల్మీకి రీసెర్చ్ సెంటర్‌తో చర్చలు, సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్‌తో వివిధ అంశాలపై పరస్పర అవగాహన ఒప్పందం, ప్రాచీన క్రీడలైన ఆర్చరీ, కర్రసాము, తైక్వాండోలో శిక్షణ, నూతన సర్టిఫికెట్ల కోర్సుల పరిచయం వంటివి చేపడుతున్నాం. వర్సిటీకి జాతీయ హోదా లభించాక అఖిల భారత స్థాయిలో మూడుసార్లు సంస్కృత ప్రతిభా సమారోహం నిర్వహించాం. గురుకుల పద్ధతిలో అధ్యయన, అధ్యాపనం కోసం యూజీసీ అనుమతితో పరమాచార్య గురుకులం ప్రారంభించాం. వర్సిటీలో జరిగే ఈప్రగతిని గుర్తించి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఎట్-హోమ్ రిసెప్షన్‌కి ఆహ్వానం అందించడం చాలా సంతోషంగా ఉంది' అని వీసీ వివరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అకడమిక్ అఫైర్స్ డీన్ రజనీకాంత్ శుక్లా, దర్శన్ డీన్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు, వేద, వేదాంగ డీన్ క్రిష్ణేశ్వర్, పీఆర్వో వి.రమేష్ బాబు, ఏపీఆర్వోలు డాక్టర్ కుమార్, డాక్టర్ బుల్లిదాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు

### రేణిగుంట బీసీ హాస్టల్ ఘటనపై మంత్రి సవిత ఆదేశం

తిరుపతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట బీసీ బాలుర హాస్టల్‌లో కలుషిత ఆహారం కారణంగా పలువురు బాలురు అస్వస్థతకు గురైన ఘటనలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హాస్టల్‌లో అస్వస్థతకు గురైన 21మంది విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి మెరుగుపడిందని అందులో పేర్కొన్నారు. వారిని తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులు డిశ్చార్జి చేయడంతో పాఠశాలకు చేరుకున్నట్టు వివరించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. సమాచారం తెలియగానే ఎప్పటికప్పుడు డీఎంఅండ్‌హెచ్‌వో, రుయా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పిల్లలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేశామన్నారు. బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను స్వయంగా రుయా ఆస్పత్రికి పంపి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా సమన్వయం చేశామని తెలియజేశారు. బయట ఆహారం తినడం వల్లే విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, వాంతులు, విరేచనాలు అవుతున్నా హాస్టల్ సిబ్బంది పైఅధికారులకు సమాచారం ఇవ్వకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని, హాస్టళ్లలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

**ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు**

రేణిగుంట బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో మంత్రి ఆదేశాలతో బాధ్యులైన ఇద్దరు అధికారులకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జి అధికారి చంద్రశేఖర్‌కు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి డి.జ్యోత్స్నకు ఆ శాఖ డైరెక్టర్ మల్లికార్జున షోకాజ్ నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందుకున్న మూడ్రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని అందులో ఆదేశించారు.

## పంచాయతీల్లో జెండా పండుగ

### స్వాతంత్ర్య దిన వేడుకలకు నిధుల పెంపు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 13: ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన గ్రామ పంచాయతీలను గాడిన పెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం తొలి అడుగు వేసింది. స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు నిధుల సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టింది. జిల్లాలో 774 పంచాయతీలున్నాయి. అందులో మేజర్ 22, మైనర్ పంచాయతీలు 752 ఉన్నాయి. వీటిలో ఈనెల 15న స్వాతంత్ర్య దిన వేడుకల నిర్వహణకు చిన్న పంచాయతీల (5వేలలోపు జనాభా)కు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25వేల చొప్పున సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మైనర్ పంచాయతీలకు రూ.100, మేజర్ పంచాయతీలకు రూ.250 మాత్రమే ప్రభుత్వం కేటాయించేది. ఈ మొత్తం చాక్లెట్ల కొనుగోలుకు చాలక సర్పంచులే సొంతంగా ఖర్చు పెట్టేవారు. గతంలోనూ స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేంద్రప్రభుత్వం పిలుపునిచ్చినా అప్పటి జగన్ ప్రభుత్వం గ్రామాలకు అదనంగా నిధులు విడుదల చేయలేదు. ఈసారి మాత్రం వేడుకలను ఘనంగా నిర్వహించడానికి పంచాయతీలు సిద్ధమవుతున్నాయి.

## ఒకరి అవయవదానంతో 8మంది జీవితాల్లో వెలుగులు


మాట్లాడుతున్న శ్రీనాథ్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13: ఒకరు అవయవదానం చేయడం వల్ల ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉంటుందని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలోని లెక్చరర్ గ్యాలరీలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ అవయవ దాన దినోత్సవంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవయవదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వైద్యరంగంలో చోటుచేసుకున్న అధునాతన పద్ధతులతో పక్క రాష్ట్రాలకు వెళ్లకుండానే మన రాష్ట్రంలోనే అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఇప్పటికే టీటీడీ వారి సహకారంతో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయలో 15కుపైగా గుండె మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ.. స్విమ్స్‌లోనూ లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఆర్ఎంవో కోటిరెడ్డి, వైద్య విభాగాధిపతులు అనీల్‌కుమార్, అలోక్ సమంత్రే, నాగరాజు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## తరిగొండ వెంగమాంబకు నివాళి


వెంగమాంబ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న రాజగోపాల్ తదితరులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 13: శ్రీవారి పరమ భక్తురాలు తరిగొండ వెంగమాంబ వర్ధంతి సందర్భంగా ఆమెకు మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఎంఆర్ పల్లె సర్కిల్‌లోని వెంగమాంబ విగ్రహానికి ఉదయం తొమ్మిది గంటలకు టీటీడీ అధికారులు పూలమాలలు వేశారు. అనంతరం శ్వేత భవనంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాహితీ సదస్సు జరిగింది. ప్రముఖ శతావధాని ఆముదాల మురళి అధ్యక్షత వహించి, ప్రసంగిస్తూ.. తన రచనల ద్వారా వేంకటేశ్వర స్వామిని వెంగమాంబ గొప్పగా కీర్తించిందన్నారు. ఆమె సాహిత్యాన్ని ఈతరం యువతకు చేరువ చేయడానికి టీటీడీ కృషిచేస్తోందన్నారు. పరిశోధకులు డాక్టర్ కేశవులు, డాక్టర్ రాజశేఖర్ ప్రసంగించారు. అనంతరం శ్వేత తాత్కాలిక సంచాలకుడు రాజగోపాల్.. కేరళకు చెందిన చిత్రకారిణి కృష్ణప్రియ రూపొందించిన వెంగమాంబ చిత్రాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం ఆరు గంటలకు అన్నమాచార్య కళామందిరంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో వెంగమాంబ గీతాలతో భక్తి సంగీత కార్యక్రమం జరిగింది. అలాగే రాయలసీమ రంగస్థలి సంస్థ అధ్యక్షుడు గుండాల గోపినాథ్ రెడ్డి, సభ్యులు కేఎన్ రాజ తదితరులు కూడా మంగళవారం ఉదయం ఎంఆర్‌పల్లె కూడలిలోని వెంగమాంబ విగ్రహం వద్ద నివాళి అర్పించారు.

## ఆర్టీసీకి సహకరించండి

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 13: తిరుమల ఘాట్‌లో రవాణా పరంగా శ్రీవారి భక్తులకు విశేషంగా సేవలందిస్తున్నామని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శ్యామలరావును మర్యాదపూర్వకంగా కలిసి ఆర్టీసీ బస్సుల వివరాలు తెలిపారు. తిరుమల, తిరుపతిలో ఆర్టీసీకి అవసరమైన మేరకు సహాయ సహకారాలు అందించాలని ఈవోకు విజ్ఞప్తి చేశారు. తిరుపతి డిపో మేనేజర్ బాలాజి, తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్‌కు సాదర స్వాగతం



తిరుపతి అర్బన్, ఆగస్టు 13: జిల్లా పర్యటనకు వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు తిరుపతి విమానాశ్రయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్, పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి, శ్రీకాళహస్తి ఇన్‌చార్జి వినుత, తదితరులు సాదర స్వాగతం పలికారు.



పవన్‌కల్యాణ్‌కు శాలువా కప్పుతున్న కిరణ్‌రాయల్ - శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న రాజారెడ్డి

## న్యాయమూర్తుల నియామకం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిని ఆయా జిల్లాలకు నియమిస్తూ హైకోర్టు విజిలెన్సు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీకాళహస్తిలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.ధర్మారావును అనకాపల్లి మొదటి తరగతి జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు. కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిలో తిరుపతికి చెందిన పల్లెపాగు ప్రశాంత్‌ను మాచర్ల అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరుకు చెందిన ఎం.రోహిత్‌ను విశాఖ జిల్లా నర్సీపట్నం అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరులో స్పెషల్ మొబైల్ కోర్టు, ఐదో అదనపు సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కీర్తనను మదనపల్లె రెండో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు.

## 29న క్రీడా ప్రతిభా అవార్డుల ప్రదానం

తిరుపతి(విద్య), ఆగస్టు 13: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని 2023-24లో ఏపీ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభచాటిన ఐదు పాఠశాలలకు ఈనెల 29న క్రీడా ప్రతిభా అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థుల సర్టిఫికెట్లను ఆయా స్కూల్స్ హెచ్‌ఎంలు, వ్యాయామ టీచర్లు ధ్రువీకరించి ఈనెల 16వ తేదీలోపు డీఈవో కార్యాలయంలో అందించాలని సూచించారు.

## రేపు ఉచిత వైద్య శిబిరం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డీబీఆర్ రోడ్డులోని ఎస్వీ చెస్ట్ ఆస్పత్రిలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ శ్వాసకోశ వైద్య నిపుణుడు డాక్టర్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కంప్యూటరైజ్డ్ పీఎఫ్‌టీ, ఈసీజీ, రక్త పరీక్షలతోపాటు శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారికి అవసరమైన ఇన్‌హెల్లర్స్ ఉచితంగా ఇస్తామన్నారు.

**రిటైర్డ్ టీటీడీ ఉద్యోగులకు 24, 25 తేదీల్లో..**

టీటీడీ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో టీటీడీ రిటైర్డ్ ఉద్యోగులకు ఈనెల 24, 25 తేదీల్లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై గ్లోబల్ ఆస్పత్రి వారి సహకారంతో టీటీడీ పరిపాలనా భవనం ఆవరణలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2డి ఏకో, సీబీజీ, పీఎఫ్‌టీ, ఈసీజీ వంటి వైద్య పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహిస్తామన్నారు. బుధవారం నుంచి రిటైర్ ఉద్యోగులు వారి స్మార్ట్ గుర్తింపు కార్డులను తీసుకొచ్చి ముందస్తుగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఆర్కే అబాకస్ విద్యార్థికి అవార్డు



తిరుపతి(విద్య), ఆగస్టు 13: బైరాగిపట్టెడలోని ఆర్కే అబాకస్‌లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పూర్తిచేసిన ఏపీ ఎన్నారై విద్యార్థి కె.దర్శిల్ అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి, అవార్డు సాధించారని చైర్మన్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆ విద్యార్థిని అభినందించారు. ఈనెల 25వ తేదీన జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారని, ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 73865 02450, 90009 76246 నెంబర్లను సంప్రదించాలన్నారు. వీక్షస్కూల్ హెచ్‌ఎం విమల, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి రమాదేవి, టీచర్లు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుల అరెస్ట్



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ

గూడూరు, ఆగస్టు 13: స్థానిక బనిగీ సాహెబ్‌పేట వద్ద ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రమణకుమార్ చెప్పారు. మంగళవారం 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని మసీదువీధికి చెందిన సోనియాతో బనిగీసాహెబ్‌పేటకు చెందిన అల్లాబక్షుకు 2020లో వివాహం జరిగిందన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాదిగా భార్యభర్తలిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో భర్త, అత్తమామలపై 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారన్నారు. సోనియా తన పిల్లలతోపాటు బనిగీసాహెబ్‌పేటలోని భర్త ఇంట్లో కాపురం ఉంటుండగా, సమీపంలో అల్లాబక్షు అతని తల్లిదండ్రులతో నివాసం ఉంటున్నాడన్నారు. తన భార్య తన ఇంట్లోనే ఉంటూ తమపైనే కేసులు పెట్టడంపై కక్ష పెంచుకున్నాడన్నారు. ఈక్రమంలో ఈనెల 10న మధ్యాహ్నం సోనియా సోదరుడు జాకీర్... సోనియా ఇంట్లో భోజనం చేస్తుండగా అటువైపు వెళ్తున్న అల్లాబక్షు తండ్రి కోడలితో వాగ్వాదానికి దిగాడన్నారు. సమీపంలో ఉన్న అల్లాబక్షు, అతని తల్లి రోకలిబండ, ప్లాస్టిక్‌పైపుతో సోనియా, జాకీర్‌పై దాడి చేశారన్నారు. తీవ్రగాయాలపాలైన జాకీర్, సోనియాను ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. అప్పటికే జాకీర్ మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. సోనియా మరో సోదరుడు షాకీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం మండలంలోని తిప్పవరప్పాడు జంక్షన్ వద్ద వున్న అల్లాబక్షు, ఆయన తల్లిదండ్రులు చాన్‌బాషా, షర్మిలను సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ శ్రీహరిబాబు అరెస్ట్ చేశారన్నారు.

## టీడీపీ హయాంలోనే అమరావతి, పోలవరం పూర్తి

● మాజీ మంత్రి డాక్టర్ పరసా



పరసారత్నాన్ని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, ఆగస్టు 13: రాష్ట్ర రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతాయని మాజీ మంత్రి పరసారత్నం అన్నారు. నాయుడుపేట ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం పరసారత్నం జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. గత 5 సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వ హాయంలో అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమ పథకాలూ అర్హులకు అందలేదన్నారు. కూటమితో రాష్ట్రంలో శాంతి భద్రతలతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, ముత్యాలయ్య వెంకటరాజు, చిన్నారావు, ఉక్కుశంకరయ్య, రవి తదితరులు ఉన్నారు.

## మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలి

● సదరన్ రైల్వే డెవలెప్‌మెంట్ కమిటీ సభ్యుడు సురేంద్ర



స్టేషన్ మాస్టర్‌తో చర్చిస్తున్న సురేంద్ర

నాయుడుపేట, ఆగస్టు 13: చెన్నై సెంట్రల్ నుంచి సూళ్లూరుపేట వరకు రాకపోకలు సాగించే మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని సదరన్ రైల్వే డెవలెప్‌మెంట్ కమిటీ సభ్యుడు చిగురాకుల సురేంద్ర అన్నారు. నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఆయన రైల్వే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నవజీవన్, హైదరాబాద్, చండీఘర్ ఎక్స్‌ప్రెస్‌లకు నాయుడుపేటలో స్టాపింగ్ కల్పించాలని, రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్, ఆర్వోవాటర్ ప్లాంట్, ర్యాంప్, డిజిటల్ క్లాక్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ తీర్మానాన్ని రైల్వే మంత్రి, సదరన్ రైల్వే డీఎంఆర్‌కు పంపించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో స్టేషన్ మాస్టర్ చిరంజీవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల్లో కార్పొరేట్ విద్యపై ప్రచారం



సూచనలిస్తున్న సీడీపీవో మునికుమారి

కోట, ఆగస్టు 13: అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధిస్తున్న కార్పొరేట్ విద్యపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోట పట్టణంలోని స్త్రీశిశు సంక్షేమ భవనంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీల్లో విద్యాబోధన జరుగుతున్న నేపథ్యంలో ప్రతి చిన్నారిని విధిగా కేంద్రాల్లో చేర్పించాలన్నారు. సమయ పాలన పాటించాలన్నారు. సూపర్‌వైజర్ కవిత తదితరులు ఉన్నారు.

## తిరుమలలో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి



తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సినీహీరో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని భాస్కర్‌భవన్ విశ్రాంతి భవనానికి చేరుకున్న వీరికి స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. వీరు బుధవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

## బీఎస్పీ సమావేశానికి తరలిరండి

కోట, ఆగస్టు 13: కులసంఘ ప్రతినిధుల రౌండ్‌టేబుల్ సమావేశాల్ని విజయవంతం చేయాలని బీఎస్పీ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.సుబ్రమణ్య కోరారు. బీఎస్పీ రాష్ట్ర నాయకులు పూర్ణచంద్రరావు, పరంజ్యోతిల ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరుగుతాయని బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఏ రాజకీయపార్టీ ఇప్పటి వరకు కులగణనకు ముందుకురాలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, స్థానిక సంస్థల్లో జనాభా నిష్పత్తి ప్రకారం దామాషాలు కేటాయించాలన్నారు. పాలనలో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలంటూ చేస్తున్న ఉద్యమాలకు బీసీలు పూర్తి సహకారం అందించాలన్నారు.

## ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

సూళ్లూరుపేట, ఆగస్టు 13: సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాలలో నవజీవన్ ఆర్గనైజేషన్, సీసీటీఐ ప్రాజెక్టు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ వ్యాప్తి చెందకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో పలు సూచనలు చేశారు. గ్రామాల్లో కూడా విద్యార్థులు దీనిపై అవగాహన కల్పిస్తే హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా చేయవచ్చని సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బాలాజి తెలిపారు. మంజుల, హరిత, నందిని కళాశాల అధ్యాపకుడు చైతన్య కుమార్ పాల్గొన్నారు.

## డ్రైనేజీల్లో పూడిక తొలగింపు



వెంకటగిరి టౌన్, ఆగస్టు 13: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కైవల్యా నది వరకు రోడ్డుకు ఇరువైపులా మున్సిపాలిటీ అధికారులు మురుగునీటి కాలువల్లో పూడిక తీశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రషీద్ మాట్లాడుతూ... అభివృద్ధి పనుల్లో భాగంగా మురుగునీటి కాలువల్లో పూడిక తీత, సెంట్రల్ లైటింగ్, డివైడర్‌పై మొక్కలతో సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. అలాగే మురుగునీటి కాలువలపై ఆక్రమణలు తొలగించామన్నారు.

**గూడూరు**
**సూళ్లూరుపేట/వెంకటగిరి**

# మహనీయులను స్ఫూర్తిగా తీసుకుందాం



గూడూరులో త్రివర్ణ పతాక ర్యాలీ - నాయుడుపేటలో తిరంగా ర్యాలీ - వాకాడు అశోక్ పిల్లర్ వద్ద విద్యార్థుల మానవహారం - వెంకటగిరిలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో తిరంగా బైక్ ర్యాలీ

గూడూరు, ఆగస్టు 13: దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని గూడూరు రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం వివేకానంద కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ నుంచి పట్టణంలో 75 అడుగుల జాతీయజెండాతో విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది మహానుభావులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాటాలు సాగించి స్వేచ్ఛ కల్పించారన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ గురులాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక రెండోపట్టణ పరిధిలోని స్వర్ణాంధ్రభారతి జూనియర్ కళాశాల నుంచి కోర్టు సెంటర్ వరకు విద్యార్థులు భారత్‌మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ... ప్రతి ఇంటి మీద జాతీయజెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రకాష్‌నాయుడు, నిరంజన్‌రెడ్డి, నవకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **నాయుడుపేట టౌన్:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి కోరారు. మున్సిపాలిటీ, వార్డు సచివాలయ సిబ్బందితో పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ మధుసూదన వర్మ హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.

● **వాకాడు**: నేటి స్వాతంత్ర్యఫలాలు ఆనాటి నేతల పోరాట ఫలితమని ఎంపీడీవో వెంకటేశ్వర రావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరంగా ర్యాలీను చేపట్టారు. ఎంఈవో నసీం అలీ, గురుకుల ప్రిన్సిపాల్ రామాంజనేయులు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి అశోక్ పిల్లర్ వరకు వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు.

● **వెంకటగిరి టౌన్**: స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త ఎస్ఎస్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు.

## డిప్యూటీ సీఎం పవన్‌తో ఎమ్మెల్యే విజయశ్రీ భేటీ



రాకెట్ ప్రయోగాల గురించి పవన్‌కు వివరిస్తున్న షార్ డైరెక్టర్, శాస్త్రవేత్తలు - విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న పవన్

సూళ్లూరుపేట, ఆగస్టు 13: అంతరిక్ష దినోత్సవం సందర్భంగా షార్ పర్యటనకు విచ్చేసిన పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకుడు నెలవల రాజేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. షార్‌లోని నక్షత్ర అతిథి గృహంలో ఆయనకు ఎమ్మెల్యే విజయశ్రీ పుష్పగుచ్ఛం అందజేశారు. తమ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ సీఎంను వారు కోరారు.

**విద్యార్థులకు బహుమతులు..**

అంతరిక్ష దినోత్సవాలను పురస్కరించుకొని షార్‌లో విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, ప్రయోగాలు, ఉపగ్రహాలు వాటి పనితీరుపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. సూళ్లూరుపేట బాలికల హైస్కూల్ విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు.

## చెత్తనుంచి సంపద క్షేత్ర సందర్శన

ఓజిలి, ఆగస్టు 13: సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమాలలో భాగంగా మంగళవారం ఓజిలి మండలం కురుగొండలో చెత్తనుంచి సంపద కేంద్రం క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కురుగొండ సర్పంచి శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. చెత్తనుంచి సంపద నేపథ్యంలో వర్మీకంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు.

**నాయుడుపేట టౌన్:** డంపింగ్ యార్డులో వేసే చెత్తాచెదారాలు, వ్యర్థాల వల్ల పర్యావరణానికి భంగం వాటిల్లకుండా చూడాలని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి అన్నారు. పుదూరు పంచాయతీ సమీపంలోని అటవీప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను జనార్దన రెడ్డి మంగళవారం పరిశీలించారు. చెత్త నుంచి సంపద వచ్చేలా మున్సిపల్ సిబ్బంది ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

**వాకాడు:** తడిచెత్తతో కంపోస్టు ఎరువు తయారుచేసి మొక్కలకు ఉపయోగించవచ్చని ఎంపీడీవో వెంకటేశ్వరరావు చెప్పారు. వాకాడులోని చెత్తసంపద కేంద్రం వద్ద సర్పంచులకు అవగాహన కల్పించారు. పొడిచెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా తిరిగి ఉపయోగించుకోవచ్చని అవగాహన కల్పించారు.

**కోట:** మండలంలోని తిమ్మానాయుడుపాళెంలో న్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో మంగళవారం వానపాముల తయారీ, సేంద్రియ ఎరువుల ఉత్పత్తులపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు అవగాహన జరిగింది. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సీహెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చిల్లకూరు, ఆగస్టు 13: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో మెహబూబీ అన్నారు. మంగళవారం మండలంలోని పారిచెర్లవారిపాళెం ఎస్టీకాలనీవాసులకు బాల్యవివాహల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే వాటిని అడ్డుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతిఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుకమ్మ, సిబ్బంది కృష్ణమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

## వాగులో పడి వృద్ధుడి మృతి

చిల్లకూరు, ఆగస్టు 13: మండలంలోని తిప్పగుంటపాళెంలో వృద్ధుడు వాగులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన పోలయ్య(85) అనే వృద్ధుడు గ్రామానికి సమీపంలోని నీటి వాగు వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడు. పోలయ్యకు మతిస్థిమితం లేక గ్రామంలో తిరుగుతుండేవాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## న్యాయమూర్తుల నియామకం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిని ఆయా జిల్లాలకు నియమిస్తూ హైకోర్టు విజిలెన్సు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీకాళహస్తిలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.ధర్మారావును అనకాపల్లి మొదటి తరగతి జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు. కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిలో తిరుపతికి చెందిన పల్లెపాగు ప్రశాంత్‌ను మాచర్ల అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరుకు చెందిన ఎం.రోహిత్‌ను విశాఖ జిల్లా నర్సీపట్నం అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరులో స్పెషల్ మొబైల్ కోర్టు, ఐదో అదనపు సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కీర్తనను మదనపల్లె రెండో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు.

## రేపు స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయన్నారు. రోగులు సహకరించాలని కోరారు.

## 29న క్రీడా ప్రతిభా అవార్డుల ప్రదానం

తిరుపతి(విద్య), ఆగస్టు 13: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని 2023-24లో ఏపీ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభచాటిన ఐదు పాఠశాలలకు ఈనెల 29న క్రీడా ప్రతిభా అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థుల సర్టిఫికెట్లను ఆయా స్కూల్స్ హెచ్ఎంలు, వ్యాయామ టీచర్లు ధ్రువీకరించి ఈనెల 16వ తేదీలోపు డీఈవో కార్యాలయంలో అందించాలని సూచించారు.

## జీవ వైవిధ్య సంరక్షణ పోటీల విజేతల ఎంపిక

తిరుపతి(విద్య), ఆగస్టు 13: ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలని ఎంపిక చేసినట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు జీవ వైవిధ్య సంరక్షణలో యువతపాత్ర అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారిని విజేతలుగా ఎంపిక చేశామని చెప్పారు. వక్తృత్వంలో.. బి.సంజన(జీహెచ్ఎస్, నాగలాపురం), సి.మాధురి (గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, తిరుపతి) కె.నవ్య (అంబేడ్కర్ గురుకులం, సూళ్లూరుపేట), డిబేట్‌లో.. వి.గుణవర్షిణి (ఎస్వీయూ క్యాంపస్, తిరుపతి), వీసీ జ్యోతిష్ (జడ్పీహెచ్ఎస్ ప్లస్, మంగళం ట్రెండ్స్), షార్ట్‌ఫిల్మ్ మేకింగ్‌లో.. జడ్పీహెచ్ఎస్ (ఊరందూరు), కేజీబీవీ (ఎర్రావారిపాలెం), అంబేడ్కర్ గురుకులం (సూళ్లూరుపేట) ఉన్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన డీవైఈవో బాలాజి మాట్లాడుతూ.. జీవ వైవిధ్యంపై అవగాహన పెంచేందుకు ఈపోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ నెమిలేటి కిట్టన్న, డాక్టర్ రాధాకృష్ణ, చిన్నమ్మ వ్యవహరించారు. జిల్లా కోఆర్డినేటర్ హరిశంకర్, క్యాంపస్ స్కూల్ హెచ్ఎం సకీనమ్మ, రిసోర్స్ పర్సన్లు కల్పన, జయకర్, కృష్ణవేణి పాల్గొన్నారు.

## సంస్కృత భాషా క్షేత్రంగా తిరుపతిని తీర్చిదిద్దుతాం

ఎన్ఎస్‌యూ వీసీ వెల్లడి

తిరుపతి రూరల్, ఆగస్టు 13: నగరంలో వంద సంస్కృత బాల కేంద్రాలను ఏర్పాటు చేసి.. తిరుపతిని సంస్కృత భాషా క్షేత్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్ఎస్‌యూ) వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వెల్లడించారు. వర్సిటీలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'చిన్నారులకు బాల్యం నుంచే సంస్కృతాన్ని బోధించేందుకు నగరంలోని పలు విద్యాసంస్థల్లో బాలకేంద్రాలు, సంస్కృత శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు వర్సిటీ ఆధ్వర్యంలో 70 బాలకేంద్రాలు నడుస్తున్నాయి. వీటి సంఖ్యను వందకు పెంచేందుకు కార్యాచరణ రూపొందించాం. అలాగే ఆగమ, జ్యోతిష, వాస్తు, యోగా, కర్మకాండ శాస్త్రాల్లో ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ఐదు కన్సల్టెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. రోజూ సాయంత్రం 5-6.30గంటల వరకు ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. వర్సిటీలో పలు పురోభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. దీనిలో భాగంగా ఎస్‌సీఎస్ ట్రస్ట్ ద్వారా రామాయణ గ్రంథాలపై పరిశోధనకు వాల్మీకి రీసెర్చ్ సెంటర్‌తో చర్చలు, సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్‌తో పరస్పర అవగాహన ఒప్పందం, ప్రాచీన క్రీడలైన ఆర్చరీ, కర్రసాము, తైక్వాండోలో శిక్షణ, నూతన సర్టిఫికెట్ల కోర్సుల పరిచయం వంటివి చేపడుతున్నాం. వర్సిటీకి జాతీయ హోదా లభించాక అఖిల భారత స్థాయిలో మూడుసార్లు సంస్కృత ప్రతిభా సమారోహం నిర్వహించాం. గురుకుల పద్ధతిలో అధ్యయన, అధ్యాపనం కోసం యూజీసీ అనుమతితో పరమాచార్య గురుకులం ప్రారంభించాం. వర్సిటీలో జరిగే ఈప్రగతిని గుర్తించి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఎట్-హోమ్ రిసెప్షన్‌కి ఆహ్వానం అందించడం చాలా సంతోషంగా ఉంది' అని వీసీ వివరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అకడమిక్ అఫైర్స్ డీన్ రజనీకాంత్ శుక్లా, దర్శన్స్ డీన్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు, వేద, వేదాంగ డీన్ క్రిష్ణేశ్వర్, పీఆర్వో వి.రమేష్‌బాబు, ఏపీఆర్వోలు డాక్టర్ కుమార్, డాక్టర్ బుల్టిదాస్ తదితరులు పాల్గొన్నారు.



షార్‌లోని కురుప్ భవనంలో నిర్వహించిన అంతరిక్ష దినోత్సవ సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ - పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, షార్ శాస్త్రవేత్తలు, పవన్ కుమార్ ఆద్య, ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

● 'టీడీఆర్' ఎఫెక్ట్

## కార్పొరేషన్లో ప్రక్షాళన మొదలు

టౌన్‌ప్లానింగ్ అధికారి బాలసుబ్రహ్మణ్యంపై బదిలీ వేటు

తిరుపతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రక్షాళన మొదలైంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై బదిలీ వేటుకు రంగం సిద్ధమైంది. ఇందులోభాగంగా ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణం నేపథ్యంలో పట్టణ ప్రణాళికా విభాగంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రహ్మణ్యంపై బదిలీ వేటు వేసింది. తిరుపతి ఏసీపీగా డిప్యుటేషన్ రద్దు చేస్తూ రాజంపేట మున్సిపాల్టీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో)గా బదిలీ చేస్తూ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పైగా ఉత్తర్వులు అందిన వెంటనే ఎటువంటి ఆలస్యం చేయకుండా తక్షణమే రిలీవ్ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. దీర్ఘకాలిక సెలవులో ఉన్న బాలసుబ్రహ్మణ్యం గత వైసీపీ ప్రభుత్వంలో (2022 జూన్ 23) తిరుపతి కార్పొరేషన్‌కు ఏసీపీగా డిప్యుటేషన్‌పై చేరారు. అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్ పట్టుబట్టి మరీ ఈయన్ను తెప్పించుకున్నారు. అప్పుడే మాస్టర్‌ప్లాన్ రోడ్ల వ్యవహారం తెరపైకి వచ్చింది. స్థల యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రోడ్డు విస్తరణ చేయడం, కోర్టు ఆదేశాలను కూడా లెక్క చేయకుండా దూకుడుగా వ్యవహరించారన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జరిగిన ఓ కౌన్సిల్ సమావేశంలో బాలసుబ్రహ్మణ్యం చొరవతోనే కొన్ని మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేయగలిగామని డిప్యూటీ మేయర్ అభినయ్ ప్రశంసించారు కూడా. దీంతో మరింత వేగంతో బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించారని, టీడీఆర్ బాండ్ల జారీలోనూ అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిడితో పనిచేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం: తల్లీబిడ్డా సురక్షితం



తిరుపతి(వైద్యం), ఆగస్టు 13: గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగింది. రేణిగుంటకు చెందిన కాజల్‌కు మంగళవారం రాత్రి 11 గంటలకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వాహనం వచ్చాక ఆమెను కాన్పు నిమిత్తం తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ ఊహ.. పైలట్ కేశవులు సాయంతో వాహనంలోనే కాన్పు చేయగా ఆడబిడ్డ పుట్టింది. కాన్పు తర్వాత తల్లీబిడ్డలను మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉన్నట్లు అక్కడి వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా 108 సిబ్బందిని వైద్యులు, కాజల్ కుటుంబీకులు అభినందించారు.

## నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు

● రేణిగుంట బీసీ హాస్టల్ ఘటనపై మంత్రి సవిత ఆదేశం

తిరుపతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట బీసీ బాలుర హాస్టల్‌లో కలుషిత ఆహారం కారణంగా పలువురు బాలురు అస్వస్థతకు గురైన ఘటనలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హాస్టల్‌లో అస్వస్థతకు గురైన 21 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని అందులో పేర్కొన్నారు. వారిని తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులు డిశ్చార్జి చేయడంతో పాఠశాలకు చేరుకున్నట్లు వివరించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. సమాచారం తెలియగానే ఎప్పటికప్పుడు డీఎంఅండ్‌హెచ్‌వో, రుయా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పిల్లలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేశామన్నారు. బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను స్వయంగా రుయా ఆస్పత్రికి పంపి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా సమన్వయం చేశామని తెలియజేశారు. బయట ఆహారం తినడం వల్లే విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, వాంతులు, విరేచనాలు అవుతున్నా హాస్టల్ సిబ్బంది పైఅధికారులకు సమాచారం ఇవ్వకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని, హాస్టళ్లలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

**ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు**

రేణిగుంట బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో మంత్రి ఆదేశాలతో బాధ్యులైన ఇద్దరు అధికారులకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జి అధికారి చంద్రశేఖర్‌కు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి డి.జ్యోత్స్నకు ఆ శాఖ డైరెక్టర్ మల్లికార్జున షోకాజ్ నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందుకున్న మూడ్రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని అందులో ఆదేశించారు.

## ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

● మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు




మీడియాతో మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

మంగళం, ఆగస్టు 13: 'ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. ఎస్సీ వర్గీకరణ పూర్తిగా రాజ్యాంగానికి విరుద్ధంగా జరిగింది' అని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఎస్సీ కులాల మధ్య చిచ్చు పెట్టడానికే వర్గీకరణ అంశాన్ని తీసుకొచ్చి, రాజకీయ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేశామన్నారు. రాజ్యాంగం ఎస్సీలకు కల్పించిన రిజర్వేషన్‌ను మరింత లాగేసుకునేందుకు అగ్రవర్ణాలవారు ఈ కుట్ర పన్నుతున్నారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు రద్దు చేసుకోవాలని.. లేకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ప్రభాకర్, రమేష్, గిరి, ధనశేఖర్, సురేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి
## సత్యవేడు

## దోపిడీ కేసులో ఆరుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

రేణిగుంట, ఆగస్టు 13: దోపిడీ కేసులో ఆరుగురి అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. ఈనెల 8న మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్ వద్ద రమేష్ అనే వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి, అతని వద్ద సెల్‌ఫోన్ లాక్కుని బలవంతంగా రూ.34వేలు ఫోన్‌పే ద్వారా వేయించుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం ప్రత్యేకంగా నిఘా ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం కొత్త చెక్‌పోస్టు వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ శరత్‌చంద్ర, ఎస్‌ఐ అరుణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గంగజాతర



గంగమ్మ ఆలయం వద్ద భక్తులు

రేణిగుంట, ఆగస్టు 13: రేణిగుంట పట్టణంలో గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. మంగళవారం ఆలయంలో అమ్మవారికి సంప్రదాయబద్ధంగా తొలి హారతి ఇచ్చి జాతరను ప్రారంభించారు. ఉదయం నడివీధి గంగమ్మ త్రిశూలం వద్ద అమ్మవారికి ఇంటి నుంచి భక్తులు వేప తోరణాలు కట్టిన బిందెలు తీసుకొచ్చి అంబళ్లు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. టీడీపీ నాయకుడు మబ్బు దేవనారాయణరెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్‌రెడ్డి, మాజీ సర్పంచు జ్యోతినారాయణ, సభ్యులు సుధ, శివారెడ్డి, రావణ సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. జాతర సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతరకు భక్తులు పోటెత్తడంతో నడివీధి గంగమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. డీఎస్పీ వెంకటాద్రి నేతృత్వంలో సీఐ శరత్‌చంద్ర ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

## దాడికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేయండి

సత్యవేడు, ఆగస్టు 13: తన భర్తపై హత్యాప్రయత్నానికి పాల్పడ్డ వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని పట్టణానికి చెందిన ఆయేషా సీఐ మురళికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆమె తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి సీఐ కార్యాలయానికి చేరుకుని సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయేషా మాట్లాడుతూ తన భర్త అక్బర్ స్థానిక శ్రీకాళహస్తి బస్టాప్ సమీపంలో పంక్చర్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెల 28వ తేదీన పక్క దుకాణానికి చెందిన బైక్ మెకానిక్ సురేష్‌కు, తన భర్తకు మధ్య వివాదం చోటు చేసుకుందన్నారు. ఈ క్రమంలో మెకానిక్ సురేష్ కిటికీకి అమర్చే అద్దం ముక్కతో తన భర్తను కడుపులో పొడిచి తీవ్రంగా గాయపర్చాడని తెలిపారు. ఘటన జరిగిన రోజున పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకు నిర్లక్ష్యం వహించడం ఏమిటని ప్రశ్నించారు. సురేష్‌ను వెంటనే అరెస్టు చేసి, తమకు న్యాయం చేయాలని సీఐను కోరారు. తప్పకుండా న్యాయం చేస్తామని సీఐ మురళి వారికి హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

## అక్కను కత్తితో పొడిచి పరార్

శ్రీకాళహస్తి, ఆగస్టు 13 ఇంటి పనుల్లో నిర్లక్ష్యం చేస్తోందంటూ ఆగ్రహించిన తమ్ముడు అక్కను కత్తితో పొడిచి గాయపరిచన ఘటన మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని పెద్దమసీదు వీధిలో జరిగింది. కుమారస్వామి తిప్పకు చెందిన హుస్సేన్ బాషా(22) పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న పండ్ల దుకాణంలో పని చేస్తుంటాడు. ఇటీవల తల్లిదండ్రులు మరణించడంతో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. పెద్దమసీదువీధికి చెందిన సహేర(26) తమ్ముడి వరసైన హుస్సేన్‌బాషాకు ఇంటి పనుల్లో సహాయం చేస్తుండేది. ఇటీవల ఇంటి పనుల్లో నిర్లక్ష్యం చేస్తోందంటూ అక్కతో తరచూ వాగ్వాదానికి దిగేవాడు. మంగళవారం ఉదయం తన ఇంట్లో పనులు చక్కబెట్టేందుకు రావాల్సిందిగా పట్టుబట్టాడు. తాను కాసేపు తరువాత వస్తానని సహేర చెప్పడంతో ఆగ్రహించిన హుస్సేన్‌బాషా కత్తితో వీపుపై పొడిచి పరారయ్యాడు. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## టిప్పర్ ఢీకొని తమిళనాడువాసి మృతి

సత్యవేడు, ఆగస్టు 13: ఆగివున్న గ్రావెల్ టిప్పర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చెన్నై సెంజికరం ప్రాంతానికి చెందిన అరుల్‌సెల్వం(42) సత్యవేడు పరిసర ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ పేరడంలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల అతని భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో తన ఇద్దరు కుమార్తెలను తన వద్దనే ఉంచుకుని పోషిస్తున్నాడు. మంగళవారం ద్విచక్ర వాహనంలో కుమార్తెలు ఇద్దరినీ సత్యవేడుకు తీసుకెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా పేరడం సమీపంలో ఆగివున్న టిప్పర్‌ను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుల్‌సెల్వం అక్కడికక్కడే మృతి చెందగా కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎస్‌ఐ వీరాంజనేయులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## పీఏసీఎస్ సభ్యులు కేవైసీ చేసుకోవాలి

పిచ్చాటూరు, ఆగస్టు 13: ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్)లో సభ్యు లుగా ఉన్న రైతులు ఈనెల 25 లోగా కేవైసీ చేసుకోవాలని సీఈవో దొరస్వామి, సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి హేమంత్ కోరారు. కేవైసీ చేసుకున్న వారికి మాత్రమే సహకార సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందని స్పష్టం చేశారు.

## కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయండి

పిచ్చాటూరు, ఆగస్టు 13: మండలంలోని ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకుని ఆరోగ్యకరమైన కాయగూరలు పండించి విద్యార్థులకు పోషకాలు అందించాలని ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్‌రాజు అన్నారు. మంగళవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండలంలోని అన్ని పాఠశాలల సమావేశం జరిగింది. అనంతరం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.

## తహసీల్దారుకు సన్మానం

ఏర్పేడు, ఆగస్టు 13: ఏర్పేడు తహసీల్దారు భార్గవిని పలువురు సత్కరించారు. ఎస్సీ ఎస్టీ జేఏసీ కన్వీనర్ ఏకాంబరం, ఐటీడీపీ మండల అధ్యక్షుడు చెవిరెడ్డి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు తహసీల్దారు భార్గవిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

శ్రీకాళహస్తి, ఆగస్టు 13 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి మంగళవారం పట్టణ పురవీధుల్లో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు రానున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని అందరూ వేడుకగా జరుపుకోవాలన్నారు. హర్ ఘర్ తిరంగా నినాదంతో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, టీడీపీ నాయకులు విజయ కుమార్, చెంచయ్య నాయుడు, కంఠా రమేష్, బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కేవీబీపురం:** మండల కేంద్రమైన కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు మునిశేఖర్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం పాఠశాల నుంచి సాయిబాబా ఆలయం వరకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటకృష్ణయ్య, బీజేపీ నాయకులు బాబుయాదవ్, వెంకటకృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




హర్ ఘర్ తిరంగాలో ర్యాలీలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కోలా ఆనంద్

**రేణిగుంట:** పట్టణంలో బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మొక్కలు నాటారు. బీజేపీ మండలాధ్యక్షురాలు తేజావతి, యువమోర్చా అధ్యక్షుడు వేణు, చంద్ర, ప్రేమ్, వెంకటేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాలసరఫరా సంఘం మహాజన సభ సమావేశం

శ్రీకాళహస్తి, ఆగస్టు 13: శ్రీకాళహస్తి పాలసరఫరా సంఘం మహాజన సభ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మునగాల మధుసూదన్‌రావు తెలిపారు. పట్టణంలోని ఎస్‌ఎల్‌వీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు సభ జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. 2024-25 బడ్జెట్ అంచనాలు, సొసైటీ కోవా గది నిర్మాణం, తిరుమల, తిరుపతిలో బ్రాంచి ఏర్పాటు, సంస్థ అభివృద్ధి తీసుకోవాల్సిన ప్రణాళికలపై చర్చించనున్నట్లు తెలిపారు.

## ఉపముఖ్యమంత్రికి స్వాగతం



పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి వినుత, బీజేపీ నేత కోలా ఆనంద్

రేణిగుంట, ఆగస్టు 13: ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళశారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో 10.15గంటలకు రేణిగుంటకు చేరుకున్న పవన్ కల్యాణ్‌కు తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే సుగుణ, జేసీ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవోలు నిశాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, శ్రీకాళహిస్తి జనసేన ఇన్‌చార్జి నగరం వినుత, బీజేపీ నేత కోలా ఆనంద్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం పవన్ కల్యాణ్ ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీహరికోటకు వెళ్లారు. అక్కడి కార్యక్రమం ముగించుకుని సాయంత్రం 5గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని గన్నవరం బయలుదేరి వెళ్లారు.

## అవయవ దానంతో పునర్జన్మ

సత్యవేడు, ఆగస్టు 13: అవయవ దానంతో మరో వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించ వచ్చని స్థానిక శ్రీవిద్య ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ నాగయ్య అన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన లేదా సహజ మరణానంతరమైన మృతుడి అవయవాలను దానమిచ్చినట్లైతే, ఆ అవయవాలతో మరో ఏడుగురికి తిరిగి ప్రాణం పోయవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

కేవీబీపురం, ఆగస్టు 13: మండలంలోని కొట్టాలమిట్ట, రాజులకండ్రిగ గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్రతి ఆడబిడ్డను పాఠశాలకు పంపించాలని, బడిమానేసిన వారిని కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. బాల్యవివాహాలు చేయడం వల్ల బాలికలకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. బాల్యవివాహాలు చేసిన, ప్రోత్సహించిన కఠిన శిక్షలు తప్పవన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

## మధ్యాహ్న భోజన నాణ్యతను పెంచండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 13: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణాధ్యక్షుడు గురవయ్య కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మధ్యాహ్న భోజనంలో కాంట్రాక్టరు మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదన్నారు. డీఈవో దృష్టి సారించి మధ్యాహ్న భోజన నాణ్యతను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బృందాదేవి

శ్రీకాళహస్తి, ఆగస్టు 13: జీవవైవిధ్యాన్ని కాపాడుకుందామని ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి అన్నారు. పట్టణంలోని సరస్వతీబాయి పురపాలక సంఘ పాఠశాలలో మంగళవారం బయోడైవర్సిటీ కన్జర్వేషన్ కార్యక్రమం నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి జీవశాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై డిబేట్స్, లఘు చిత్రాలను ప్రదర్శించారు. మొత్తం 30మంది విద్యార్థులు పాల్గొనగా నవ్య(డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, సూళ్లూరుపేట), రేష్మ(జడ్పీ ఉన్నత పాఠశాల, ఊరందూరు), తేజస్విని (సరస్వతిబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాల, శ్రీకాళహస్తి) జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి మాట్లాడుతూ నేటి యువత బయోడైవర్సిటీ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, గోపాల్, భాస్కర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వాహణ పంచాయతీల ప్రధాన బాధ్యత

సత్యవేడు, ఆగస్టు 13: గ్రామాలలో పారిశుధ్య నిర్వాహణ పంచాయతీల ప్రధాన బాధ్యత అని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో మంగళవారం పారిశుధ్య నిర్వాహణపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణతో పాటు నియంత్రణ బాధ్యత పంచాయతీలపైనే ఉందన్నారు. మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వాహణలో సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రీసోర్స్ పర్సన్‌లు శైలేంద్ర, గోవిందస్వామి, సెక్రటరీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

కేవీబీపురం, ఆగస్టు 13: మండలంలోని కోవనూరు గ్రామానికి చెందిన మాజీ వైఎస్ ఎంపీపీ కిరణ్‌యాదవ్ కుమారుడు ఇంజనీరింగ్ విద్యార్థి యోగేష్ ఆదివారం రాత్రి కారు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోవనూరుకు చేరుకుని కిరణ్‌యాదవ్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, రామంజులు నాయుడు, కన్నయ్య నాయుడు, గోపినాథరెడ్డి, మునస్వామి యాదవ్, ప్రకాష్‌యాదవ్, సురేష్‌రెడ్డి, వినయ్ పాల్గొన్నారు.

## విద్యతో పేదరికం దూరం

ఏర్పేడు, ఆగస్టు 13: విద్యతో పేదరికాన్ని దూరం చేయవచ్చని స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ సభ్యుడు రాజేష్ అన్నారు. ఏర్పేడు మండలం పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్‌మేళా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు నితీష్, యామిని పాల్గొన్నారు.

## వైభవంగా దుర్యోధన వధ



ఏర్పేడు, ఆగస్టు 13: పాపానాయుడుపేటలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో రెండు రోజులుగా వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం దుర్యోధనవధ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. ధృతరాష్ట్రుడి కుమారుడు దుర్యోధను డిని పాండురాజు కుమారుడు భీముడు వధించే దృశ్యాన్ని వేషధారులు భక్తులకు కళ్లకు కట్టినట్లు చూపించారు.

## శేష వాహనంపై వీరభద్రుడు

నారాయణవనం, ఆగస్టు 13: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా మంగళవారం స్వామివారు పులి వాహ నంపై ఊరేగితూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం భద్రకాళీ సమేత వీరభద్రులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం భద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారు పులి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.








పుత్తూరు పట్టణంలో సత్యా ఏజెన్సీస్ షోరూంను మంగళవారం ప్రారంభించారు. సుభాషిణి హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ శ్రీధర్‌రాజు, డాక్టర్ సుభాషిణి, ద్వారకనాథశెట్టి, సత్యా ఏజెన్సీస్ ఏపీ హెడ్ సెంథిల్ పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలమ్మ

పుత్తూరు టౌన్, ఆగస్టు 13: గ్రామాల అభివృద్ధి కోసం అందరూ సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ మునివేలమ్మ అన్నారు. మంగళవారం పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కారించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునస్వామి రెడ్డి, విమలమ్మ, ఎంఈవో తిరుమలరాజు, బాల సుబ్రహ్మణ్యం, ఆర్టికల్చర్ అధికారి వెంకటసౌజన్య, వ్యవసాయ శాఖ ఏఈ కోదండయ్య, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆటల పోటీలు



వడమాలపేట, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వడమాల పేట పంచాయతీ పరిధిలోని ఐదు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. ఆగస్టు 15న విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ తెలిపారు.

## 16 నుంచి కుంభాభిషేక ఉత్సవాలు

వడమాలపేట, ఆగస్టు 13: మండలంలోని ఎస్‌వీపురంలో వెలసిన సీతారాముల ఆలయంలో ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు మహా కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 16న శుక్రవారం గోపూజ, అంకురార్పణ, కలశస్థాపలన, 17న వేదపారాయణం, చండీ యాగం, యంత్ర ప్రతిష్ట 17న నవగ్రహా, సుదర్శన హోమం, మహా కుంభాభిషేకం, సీతారాముల కల్యాణోత్సవం, రాత్రి ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రాజశేఖర్ వర్మ, తిరుమల, తులసీరామ్ తెలిపారు.

# ద్రౌపదీదేవికి పట్టు వస్త్రాల సమర్పణ

పుత్తూరు టౌన్, ఆగస్టు 13: పట్టణంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి కల్యాణోత్సవాన్ని పురష్కరించుకుని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం పట్టువస్త్రాలు, మంగళసూత్రం సమర్పించారు. ముందుగా తిరుపతి రోడ్డులోని కామాక్షి సమేత సదాశివేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. ద్రౌపదీదేవి ఆలయ నిర్వాహకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ద్రౌపదీదేవి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. నగరి నియోజక వర్గంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే పురపాలక సంఘం తరపున కమిష నర్ కేఎల్ఎన్ రెడ్డి పట్టువస్త్రాలు ఎమ్మెల్యేతో కలిసి సమర్పించారు. రాత్రి 8గంటలకు అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహి చారు. అనంతరం స్వామి అమ్మవార్లు అశ్వ వాహనంపై విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సాల్వాకం క్రిష్టప్ప మొదలి, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, టీడీపీ నాయకులు జీవరత్నం నాయుడు, గంజీ మాధవయ్య, షణ్ముగ రెడ్డి, రావిళ్ల మాధవనాయుడు, ఎన్ఎన్ ధనపాల్, ఆనంద్, అశోక్, బొబ్బిలి, కోలా సుధాకర్, సునీల్‌కుమార్, నాగరత్న, మణిరెడ్డి, హమీద్, చాను తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

## కైలాసనాథ కోనకు బస్సు సౌకర్యం

పుత్తూరు టౌన్, ఆగస్టు 13: నారాయణవనం మండలంలో ఉన్న కైలాసనాథ కోనకు పుత్తూరు నుంచి నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మంగళవారం ప్రారంభించారు. పుత్తూరు ఆర్టీసీ డిపోలో జెండాఊపి బస్సు సర్వీసును ప్రారంభించారు. డిపో మేనేజర్ ప్రశాంతి, అసిస్టెంట్ మేనేజర్ మంగమ్మ, ఎన్ఎంయూఏ డిపో అధ్యక్ష, కార్యదర్శులు సుందరం, శివకుమార్, ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ పెరుమాల్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, నాయకులు జీవరత్నం నాయుడు, గంజీ మాధవయ్య, షణ్ముగరెడ్డి, రావిళ్ల మాధవనాయుడు, ఎన్ఎన్ ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు భానుప్రకాష్, ఆదిమూలం

## విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిద్దాం: ఆపస్

పుత్తూరు టౌన్, ఆగస్టు 13: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిద్దామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొరస్వామి, ఏపీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రీచ్ గ్లో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ సౌజన్యంలో పుత్తూరు మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు మంగళవారం భరతమాత చిత్రపటాలను అందజేశారు కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు వీవీ సుబ్రహ్మణ్యం, రమేష్, చెన్న కేశువుల, చక్రపాణి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ

పుత్తూరు టౌన్, ఆగస్టు 13: స్వాతంత్ర దినోత్సవం పురష్కరించుకుని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య ఫలితాలను సాధించడంలో అమరవీరుల కృషి గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సమన్వయాధికారి డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**వడమాలపేట:** స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య కోసం పోరాడిన అమరవీరుల త్యాగనిరతిని స్మరించుకుంటూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.